


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 27.12.2025 | సంపుటి : 2 | సంచిక :321 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 27.12.2025 | volume : 2 | Issue : 321 | Pages : 8 | Cost : 2/- |

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



ప్రజల్లోకి వెళ్దాం..

## ఉద్యమాన్ని నిర్మిద్దాం

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని అసెంబ్లీలో ఎండగట్టాల్సిందే**

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

హైదరాబాద్: ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ సీనియర్ నేతలతో భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సమావేశం ముగిసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోత ల తదుపరి కార్యాచరణపై నేతలతో చర్చించారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తెలంగాణకు కాంగ్రెస్ ఎప్పుడూ

-మిగతా 2 లో..

# యధావిధిగా రైతుభరోసా

**నిలిపివేస్తున్నారంటూ వస్తున్న వార్తలు అవాస్తవం**

సామాజిక మాధ్యమాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు

**తెలంగాణలో రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతోన్న ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించింది. ఇందులో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఇలాంటి వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, దురుద్దేశంతో కూడినవేనని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.**






హైదరాబాద్, డిసెంబర్ 26 :"రైతు భరోసా కింద తెలంగాణలో దాదాపు 65 లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడంలేదు. ప్రస్తుతం సంబంధిత జిల్లా కమిటీలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూసేందుకు క్షేత్రస్థాయి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నాయి. అలాగే, ఆర్థిక శాఖ సైతం లబ్ధిదారులకు చెల్లింపులు చేసేందుకు వారి జాబితాను సిద్ధం చేసి తిరిగి తనిఖీ కూడా నిర్వహిస్తోంది. రైతు భరోసా నిలిపివేస్తున్నారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఇది లబ్ధిదారులను తప్పుదోవ పట్టించేదిగా ఉంది" అని పేర్కొంది.

శాటిలైట్ మ్యాపింగ్ గురించి..

"వాణిజ్య వినియోగంలో ఉన్న భూములకు సంబంధించి రైతు భరోసా ప్రయోజనాలు పొందుతున్న వారిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ఆచార్య

-మిగతా 2 లో..

సాహస బాలలకు బాల

## పురస్కార్ అవార్డులు

**అవార్డులను అందచేసిన రాష్ట్రపతి ముర్ము**



**న్యూఢిల్లీ వేదికగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఢిల్లీలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు అనే ఆరు విభాగాల్లో సృజనాత్మకత చూపించిన వారికి అందించారు.**

న్యూఢిల్లీ, డిసెంబర్ 26 :అవార్డు గెలుచుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. వారి సాహసాలు, విజ్ఞానం దేశానికి గర్వకారణం ఆమె ప్రశంసించారు. వయసుకు మించి ధైర్య సాహసాలు, ప్రతిభను ప్రదర్శించే చిన్నారులకు 'వీర్ బాల్ దివస్' సందర్భంగా ఏటా పురస్కారాలు అందిస్తారు. ఈ ఏడాది రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల

-మిగతా 2 లో..



# మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటా

**మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు**

**రేవంత్ రెడ్డి చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు**

**ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాలి**

**సిఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్**

హైదరాబాద్, డిసెంబర్ 26 : కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కు సీఎం రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇక కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చస్తాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి

-మిగతా 2 లో..



హెచ్-1 వీసాల్లో

## జాప్యంతో తీవ్ర ఆందోళన

- సమస్యను అమెరికా దృష్టికి తీసుకుని వెళ్లాం
- విదేశాంగాశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి

04



07

## వెండి ధగధగలు

**రూ.2.37 లక్షలు దాటి పరుగులు**



ఫోన్ ట్యాపింగ్ కేసులో

# ఆరా మస్తాన్ రెండోసారి విచారణ

**సిట్ విచారణకు సహకరిస్తానని చెప్పిన మస్తాన్**

హైదరాబాద్, డిసెంబర్ 26 : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో భాగంగా ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, 'ఆరా' పోల్ స్ట్రాటజీస్ సంస్థ వ్యవస్థాపకుడు ఆరా మస్తాన్‌ను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం శుక్రవారం విచారించింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన నూతన సిట్


-మిగతా 2 లో..

## కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు

**ప్రేమించి పెళ్లి చేసుకున్నా.. నిత్యం అనుమానమే**

**పెట్రోల్ పోసి భార్యకు నిప్పటించిన దుర్మార్గుడు**

హైదరాబాద్ నగరంలోని నల్లకుంటలో దారుణం జరిగింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అనుమా నంతో ఓ కిరాతకుడు దారుణంగా హత్య చేశాడు. అది కూడా పిల్లల ముందే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. అడ్డువెళ్లిన కూతురును కూడా మంటల్లోకి తోయగా ఆమె తృటిలో తప్పించుకుంది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది.



04



మాంజా తగిలి..

## యువకుడి మెడకు 19 కుట్లు

హైదరాబాద్: గాలిపటం మాంజా తగిలి యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో జరిగింది. ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్న జశ్వంత్‌రెడ్డి మెడకు మాంజా చుట్టుకుంది. దీంతో మెడపై తీవ్రగాయం కావడంతో స్థానికులు హుటాహుటిన బాధితుడిని

-మిగతా 2 లో..

## ఎప్పటికైనా సొంతింటికి వెళ్లాల్సిందే

- ఢిల్లీ నాయకత్వం పిలుపుకోసం ఎదురు చూస్తున్నా
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

03

ఎమ్మెల్యే రాజాసింగ్ మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఎప్పికైనా సొంతింటికి వెళ్లక తప్పదని చెప్పారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఒక అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే.. ఏదో ఒక రోజు అతను ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. అలాగే తాను కూడా ఈ రోజు కాకపోయినా రేపైనా తన ఇంటికి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయినతే ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో చెప్పలేనంటూ దాటవేశారు. తాను బీజేపీకినిజమైన సైనికుడిని అని తెలిపారు.






06

**ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గింపు అంశం**

## కేంద్రానికి 10 రోజుల గడువు : ఢిల్లీ హైకోర్టు

ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గించే అంశంపై వివరణాత్మక స్పందన తెలియజేసేందుకు కేంద్రానికి దిల్లీ హైకోర్టు 10 రోజుల గడువు విధించింది. దేశ రాజధానిలో గాలి నాణ్యత క్షీణిస్తున్నందున ఎయిర్ ప్యూరిఫైయర్లను వైద్య పరికరంగా పరిగణించి.. వాటిని 5శాతం జీఎస్టీ శ్లాబులోకి తీసుకొచ్చేలా ఆదేశాలివ్వాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన సంగతి తెలిసిందే.



# రైతు భరోసా ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జర్మన్ టెక్నాలజీ సాయంతో 'శాటిలైట్ మ్యాపింగ్' నిర్వహిస్తోంది. 2024లో చేపట్టిన ఒక గ్రౌండ్ సర్వే ప్రకారం దాదాపు నాలుగు లక్షల ఎకరాల భూమి.. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ పరిధిలో వాణిజ్య వినియోగంలో ఉంది. ఈ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా ప్రతి లబ్ధిదారుడి వద్ద ఎంత భూమి సాగు విస్తీర్ణంలో ఉందో నిర్ధారించొచ్చు. రైతు భరోసా పొందుతున్న భూమి రియల్ ఎస్టేట్ వెంచరా?బీ కొండా, రోడ్డా, ఫాంహౌసా అనే విషయాన్ని ధ్రువీకరించేందుకు కూడా ఈ మ్యాపింగ్ ఉపయోగపడుతుంది. మ్యాపింగ్ ప్రక్రియ అనేది ఫీల్డ్ డేటాను రికార్డులతో ధ్రువీకరించడానికి మాత్రమే. రైతు భరోసా పథకం కింద గతేడాది దాదాపు రూ. 8,500 కోట్ల నుంచి రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రైతు భరోసా విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించలేదు. రైతులు రబీ/ఖరీఫ్ కాలాల్లో పంటలు పండించవచ్చు. అలాంటి వారు కూడా ఈ పథకానికి అర్హులే. ఒక సీజన్‌లో ఒకే పంట పండించిన రైతులకూ ఆర్థిక సహాయం అందిస్తున్నాం. లబ్ధిదారులందరికీ రెండు సీజన్లకు ఎకరానికి రూ. 12 వేలు చొప్పున అందుతుంది.

### ఏవైనా అభ్యంతరాలుంటే..

ఒకవేళ జాబితా నుంచి పేర్లు తొలగించినా, అభ్యంతరాలు ఉన్నా వివరణ కోసం రైతులు జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులను సంప్రదించవచ్చు. గతేడాది సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం 90 రోజుల వ్యవధిలో పూర్తి చేయాల్సిన రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని కేవలం 9 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృ ష్టించింది. నిజమైన లబ్దిదారులకు నష్టం జరగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రజలు ఎవరూ రైతు భరోసాపై దుష్ప్రచారాలు, అసత్య వార్తలను నమ్మొద్దు" అని విజ్ఞప్తి చేసింది.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో

# సిట్ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

ఈ విచారణ ప్రారంభించింది. ఈ విచారణ సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే రెండు సార్లు పోలీసులు ఆరా మస్తాన్‌ను ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈసారి విచారణలో భాగంగా ఆయన గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్లను తిరిగి పరిశీలించి, కన్ఫర్మేషన్ కోసం అదే ప్రశ్నలను మరోసారి అడిగినట్లు తెలుస్తోంది. సిట్ అధికారులు 2020 సంవత్సరం నుంచి ఆరా మస్తాన్ వివిధ కీలక రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులతో మాట్లాడిన ఫోన్ కాల్స్ రికార్డింగ్స్‌ను సమగ్రంగా పరిశీలించారు. ఈ కాల్ డేటా ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందా? జరిగితే ఎవరి ఆదేశాల మేరకు జరిగింది? అనే అంశాలపై సిట్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. సిట్ అధికారుల విచారణ అనంతరం ఆరా మస్తాన్ మీడియాతో మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ తనను ఈరోజు విచారణకు రావాలని పిలిచిందని అన్నారు. అధికారుల పిలుపు మేరకే తాను హాజరయ్యానని తెలిపారు. గతంలో అడిగిన ప్రశ్నలనే మరోసారి అడిగి, తన వాంగ్మూలాన్ని నిర్ధారించు కున్నారని వెల్లడించారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను స్పష్టమైన సమాధానాలు ఇచ్చానని చెప్పుకొచ్చారు. తన ఫోన్ ట్యాపింగ్ 2020 సంవత్సరం నుంచే జరుగుతోందన్న అనుమానం ఉందని తెలిపారు. అప్పటి నుంచి తన కాల్స్, కమ్యూనికేషన్‌పై నిఘా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని విచారణలో సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిందని ఆరా మస్తాన్ అభిప్రాయపడ్డారు. గతంతో పోలిస్తే ఇప్పుడు విచారణ మరింత సమగ్రంగా, స్పష్టంగా కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. నూతన సిట్ దర్యాప్తు ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ కేసు త్వరలోనే ఒక స్పష్టమైన దశకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని సిట్ అధికారులు తనకు చెప్పారని అన్నారు. తాను చట్టపరమైన పక్రియలకు పూర్తిగా సహకరిస్తానని, నిజాలు బయటకు రావాలన్నదే తన ఆకాంక్ష అని ఆరా మస్తాన్ స్పష్టం చేశారు. ఈ కేసులో సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తోండటంతో రానున్న రోజుల్లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని రాజకీయ, న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది ఫలితం రాష్ట్ర రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా వి.విక్టర్

**హైదరాబాద్:** కామారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న వి. విక్టర్.. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం (ఎగ్జిక్యూటివ్ బ్రాంచి) రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా జీహెచ్‌ఎంసీ శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ, కోశాధికారిగా సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు నియామకమయ్యారు. నూతన కార్యవర్గానికి సంఘం మాజీ అధ్యక్షుడు చంద్రమోహన్, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

## తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సలహాదారుగా నాగప్పన్

**హైదరాబాద్:** తెలంగాణ లైఫ్‌సైన్సెస్ డైరెక్టర్‌గా సర్వేశ్‌సింగ్‌ను నియమించినట్లు పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత డైరెక్టర్, తెలంగాణ లైఫ్‌సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి ఎం. నాగప్పన్ వచ్చే ఏడాది మార్చి 26 వరకు సలహాదారుగా సేవలు అందిస్తారని అన్నారు. కొత్తగా నియమితులైన సర్వేశ్‌సింగ్ ఈ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అప్పటివరకు శక్తి నాగప్పన్‌తో కలిసి పనిచేయనున్నట్లు మంత్రి వివరించారు.

## సాహస బాలలకు

# బాల పురస్కార్ అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

మీదుగా బిహార్ చిన్నోడు వైభవ్ సూర్యవంశీ సహా పలువురు చిన్నారులు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను అందుకున్నారు. పురస్కార గ్రహీతల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. వీరిలో వ్యోమప్రియ ప్రదర్శించిన సాహసం, శ్వాన్ సింగ్ ఉదారత పలువురి హృదయాలను కదిలించింది. కరెంట్ షాక్ నుంచి ఓ బాలుడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన 8 ఏళ్ల చిన్నారి వ్యోమ ప్రియ తరఫున ఆమె తల్లి అర్చనా శివరామకృష్ణన్ రాష్ట్రపతి నుంచి పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార్తెను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా కుమార్తె తరఫున ఈ అవార్డు తీసుకుంటున్నా. అప్పుడు మా అమ్మాయికి ఎనిమిదేళ్లు. మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉన్న పిల్లల పార్క్‌లో మిగతా చిన్నారులతో కలిసి ఆడుకుంటోంది. అక్కడ అండర్‌గ్రౌండ్ కేబుల్‌పై ఏర్పాటు చేసిన స్లైడ్‌పై ఆడుకుంటున్న ఆరేళ్ల పిల్లాడు అకస్మాత్తుగా పడిపోయాడు. ఆ చిన్నారిని కాపాడదామని వెళ్లిన నా కూతురుకు కరెంట్ షాక్ తగిలింది. ఆ ఘటనలో మా ప్రియతో పాటు ఆ బాలుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. కేబుల్ దెబ్బతిని ఉండటంతో స్లైడ్‌కు షాక్ రావడమే అందుకు కారణమైంది. అంత చిన్న వయసులోనే ధైర్యం ప్రదర్శించిన నా బిడ్డ ఇప్పుడు నేరుగా వచ్చి ఈ అవార్డు తీసుకొని ఉంటే ఎంతో సంతోషించేవాళ్లం అంటూ అర్చనా ఉద్వేగభరితంగా చెప్పారు. 2024 మేలో తమిళనాడులోని కొయంబత్తూరులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఓ పదేళ్ల బాలుడు మన సైనికులకు బాసటగా నిలిచాడు. అడగకముందే వారికి మంచినీరు, పాలు, టీ, లస్సీ.. వంటివి అందిస్తూ తనవంతు సాయం చేశాడు. అతడే శ్వాన్ సింగ్. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లాకు చెందిన ఆ బాలుడి ధైర్యసాహసాలు, ఉత్సాహానికి ప్రశంసించిన సైన్యం అతడి చదువుకయ్యే ఖర్చులు



పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలో తాజాగా శ్వాన్ సింగ్‌ను ఇప్పుడు బాలల పురస్కారం వరించింది. ఈ అవార్డును తాను కలలో కూడా ఊహించలేదని చిన్నారి సంతోషం వ్యక్తంచేశాడు. ఏటా డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ నిర్వహిస్తారు.

## మా అయ్య మొగోడు..

# తెలంగాణ తెచ్చిన మొనగాడు



(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు అని కేటీఆర్ అన్నారు. మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటానని స్పష్టం చేశారు. నీ లెక్క సంచులు మోసుకుంటే నీ పిల్లలు చెప్పుకోరు అని విమర్శించారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలవకుండా చేసే బాధ్యత మాది అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి భాషను చూస్తే పిల్లలు నేర్చుకునే పరిస్థితి ఉందని అన్నారు. నేను గుంటూరులో చదువుకుంటే నీకేం బాధరా అని ప్రశ్నించారు. నేను హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాష నేర్చుకున్నా.... నువ్వు కూడా నేర్చుకో అని అన్నారు. నేను గుంటూరులో ఇంటర్ చదువుకున్నా.. నీ అల్లుడు ఆంధ్రోడే కదా అని ప్రశ్నించారు. ఇక చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు అని ఎద్దేవా చేశారు. పాలమూరు ? రంగారెడ్డి డీపీఆర్‌ను వెనక్కి పంపితే ఏం చేస్తున్నావని కేసీఆర్ అడిగారని తెలిపారు. 10 శాతం పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని అడిగారని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని అడిగారు.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే రేవంత్ రెడ్డికి కోపమొస్తుందని అన్నారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డల పెళ్లికి రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని సోనియాగాంధీ మీద రేవంత్ రెడ్డి ఒట్టువేశాడని తెలిపారు. మహిళలకు రూ. 2500 ఇస్తానని ప్రియాంక గాంధీ మీద ఒట్టు వేశాడని గుర్తుచేశారు. ఇవన్నీ ఎగవేసి.. ఇప్పుడు కోటి మంది మహిళలకు కోటీశ్వర్లను చేస్తానంటున్నాడని మండిపడ్డారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలంటే బ్జడెట్ సరిపోతుందా అని ప్రశ్నించారు. బ్యాగులు మోసి జైలుకెళ్లి.. పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యాడని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సెటైర్లు వేశారు. ఢిల్లీకి సంచులు మోసి పదవులు కాపాడుకుంటున్నాడని ఆరోపించారు. మహిళలకు ఇస్తానన్న రూ. 2500 ఎక్కడపోయాయని అడిగితే నీ గుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా అంటున్నాడని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వమంటే నీ లాగుల తొండలు ఇడుస్తా అంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను తిట్టాలనుకుంటే మూడు భాషల్లో పొల్లుపొల్లు తిడతానని స్పష్టం చేశారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి ఇష్టారీతిన మొరుగుతున్నాడని అన్నారు. అమ్మ గీతమ్మ రేవంత్ రెడ్డిని కట్టేయ్.. లేదంటే ఎవరినన్న కరిచేలా ఉన్నాడని విమర్శించారు. కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రాకుండా చేస్తానని రేవంత్ రెడ్డి శపథం చేస్తున్నాడని తెలిపారు. జనవరి 1 నుంచి మహిళలకు రూ. 2500 ఇస్తానని శపథం చేయాలని రేవంత్ రెడ్డికి సూచించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్‌ఎస్‌లోనే ఉంటే.. అనిల్ రెడ్డి పార్టీలో చేరినప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేసి ఉప ఎన్నికకు రావాలని అరికెపూడి గాంధీకి సవాలు విసిరారు. ఎమ్మెల్యే పేరులో గాంధీ మాత్రమే ఉందని.. కానీ చేసేది భూకబ్జాలు అని విమర్శించారు. అల్విన్ కాలనీలో సమావేశం పెడతామంటే ఫంక్షన్ హాలు యజమాని బెదిరించాడని తెలిపారు. హైదరాబాద్ చరిత్రలో ఎవరితో సంబంధం లేకుండా బీఆర్‌ఎస్‌కు జీహెచ్‌ఎంసీ కార్పొరేషన్‌ను అప్పజెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని 23 ఎమ్మెల్యేలను గెలిపించారని అన్నారు. హైదరాబాద్ వాసులందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టారని తెలిపారు. 40శాతం సర్పంచ్‌లను బీఆర్‌ఎస్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సరైన నాయకులకు అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. స్థానిక నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంతో కొట్లాడి పనులు చేయిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు గెలిస్తే కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేస్తారంటా అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌ను ఎన్ని ముక్కలు చేసినా ఓట్లు వేసేది ప్రజలే అని అన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు భూకబ్జాలు చేస్తున్నాడని కేటీఆర్ అన్నారు. మంత్రి కొడుకుపై కేసు పెట్టిన అబీబుల్లాఖాన్‌ను బదిలీ చేశారని తెలిపారు. గన్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ కూతురే స్వయంగా చెప్పిందని గుర్తుచేశారు.

# స్వీపర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలి

## వేతన ప్రయోజనాలన్నింటినీ చెల్లించాలి : హైకోర్టు

**హైదరాబాద్:** జడ్పీ, పంచాయతీ శాఖల పరిధిలో మూడు దశాబ్దాలుగా స్వీపర్లుగా పనిచేస్తున్నవారు తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలంటూ సమర్పించిన వినతుల్ని పరిశీలించడంలో అధికారులు విఫలమయ్యారని హైకోర్టు ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసింది. 30 ఏళ్లుగా తాత్కాలిక సేవలందిస్తున్నా తమ సర్వీసును ఖాళీల్లో క్రమబద్ధీకరించకపోవడాన్ని సవాలు చేస్తూ ఎన్. అశోక్ మరో 38 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది సీహెచ్. గణేశ్ వాదనలు వినిపిస్తూ.. తమ సర్వీసును పరిగణనలోకి తీసుకుని చివరి గ్రేడ్ అయిన అటెండర్/వాచ్‌మెన్ పోస్టుల్లో క్రమబద్ధీకరించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఉమాదేవి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 10 ఏళ్ల తాత్కాలిక సర్వీసు పూర్తయినవారిని క్రమబద్ధీకరించాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి ఇదే హైకోర్టు పలు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుంటూ స్వీపర్లుగా పనిచేస్తున్న పిటిషనర్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుని క్రమబద్ధీకరించి ఇంక్రిమెంట్‌లతో సహా అన్ని వేతన ప్రయోజనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. క్రమబద్ధీకరణ నిమిత్తం వినతి పత్రాలతో సహా అన్ని ఆధారాలను అధికారులకు సమర్పించాలంటూ పిటిషనర్లను ఆదేశించారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని

# అసెంబ్లీలో ఎండగట్టాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ద్రోహమే చేస్తోంది. బీఆర్‌ఎస్‌కు తప్ప.. మరే ఇతర పార్టీకి తెలంగాణపై పట్టింపులేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాల్సిందే. ప్రజల్లోకి వెళ్దాం. ఉద్యమాన్ని నిర్మిద్దాం. నీటి హక్కులు పరిరక్షించుకునే బాధ్యత బీఆర్‌ఎస్‌పైనే ఉంది. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీ వేదికగా వివరిద్దాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహాన్ని అసెంబ్లీ వేదికగా చెబుదాం" అని పార్టీ నేతలతో కేసీఆర్ అన్నట్టు సమాచారం. ఈనెల 29న శాసనసభకు కేసీఆర్ హాజరయ్యే అవకాశముందని, అసెంబ్లీ సమావేశాల తర్వాత బీఆర్‌ఎస్ బహిరంగ సభలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు.

# మాంజా తగిలి.. మెడకు 19 కుట్లు

(మొదటిపేజీ తరువాయి)

కీసరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జశ్వంత్‌రెడ్డి మెడకు 19 కుట్లు వేశారు. సంక్రాంతి నేపథ్యంలో కీసరలో దొంగచాటుగా నిషేధిత మాంజా విక్రయాలు జరుపుతున్నారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రంలో పాలన పూర్తిగా కుంటుపడింది

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రభుత్వ పాలన పూర్తిగా కుంటుపడిందని.. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఒకరినొకరు దూషించుకునేందుకే సమయం సరిపోతోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి, భారాస అధినేత కేసీఆర్‌లు పరస్పరం పరుష పదజాలంతో ఆరోపణలు చేసుకుంటున్నారు. పాలనలో తమ మార్కు చూపలేక కేవలం విమర్శలతోనే రాజ్యమేలుతున్నారు. 2014 నుంచి రాష్ట్రంలో చిల్లర రాజకీయాలే తప్ప అభివృద్ధి కనిపించడం లేదు' అని సంజయ్ ధ్వజమెత్తారు.

# సిక్కుల సంక్షేమానికి మోదీ పాటుపడుతున్నారు

## ఎన్.రామచందర్‌రావు

**హైదరాబాద్:** దేశంలో సిక్కుల కోసం ప్రధాని మోదీ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 'వీర్ బాల్ దివస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'సిక్కుల మత గురువు గురు గోవింద్ సింగ్‌జీ చిన్న కుమారులు.. జోరావర్ సింగ్, ఫతే సింగ్‌ల త్యాగాలకు ప్రతీకగా 'వీర్ బాల్ దివస్'ను దేశవ్యాప్తంగా నిర్వహించాలని మోదీ పిలుపునిచ్చారు. కర్తార్‌పుర్ సాహిబ్ కారిడార్‌ను రూ. వందల కోట్లతో పూర్తి చేయడంవల్ల పాకిస్థాన్‌లోని గురుద్వారాలకు సిక్కులు వెళ్లే అవకాశం కలిగింది. పంజాబ్‌లోని అనేక సిక్కు పవిత్ర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులిచ్చింది. గురుద్వారాలో ప్రతిరోజూ నిర్వహించే లంగర్‌కు వినియోగించే వస్తువులపై మోదీ జీఎస్టీని మినహాయించారు' అని పేర్కొన్నారు.

# నేటి నుంచి టెట్ హాల్‌టికెట్లు

**హైదరాబాద్:** రాష్ట్రంలో జనవరి 3వ తేదీ నుంచి జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) హాల్‌టికెట్లు శనివారం అందుబాటులోకి రానున్నాయి. వాటిని టెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

# ప్రపంచ చరిత్రలోనే ఒక మైలురాయి

- కనివినీ ఎరుగని రీతిలో సమ్మక్క సారలమ్మమహా జాతర
- శాశ్వతంగా 200 ఏళ్ళు నిలిచేలా గద్దెల పునర్నిర్మాణం
- మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి..
- ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట
- ప్రతి నిర్మాణంలో సంస్కృతికి ప్రతిబింబించేలా చర్యలు..
- సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం ఆమోదంతోనే ముందుకెళ్తున్నాం..
- పనులు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం..
- 30 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంధాల్లోని విశేషాలకు శిల్ప రూపం..
- అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క





**ములుగు,డిసెంబర్ 26 :** ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయనీ ,నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ ,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అనసూయ పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్ పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ పునర్ నిర్మాణం పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం వచ్చింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర ,పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను మీడియా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పూజారుల సంఘం అభిప్రాయం తీసుకుని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్లో వన దేవతలు ఉండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్వకాలంలో గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందని, శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందని దీనిని వాడకం చేయడం వలన పూర్వం లో ఆదివాసులు ఎలాంటి వ్యాధుల బారిన పడిన పసుపును వాడుకున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్ధాంతాన్ని ఆచరించామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఒకే వరుస క్రమంలో సులభతరంగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుతామని మంత్రి తెలిపారు.

చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని భక్తులందరూ విజయవంతనికి కృషి చేయాలని సహకరించాలని కోరారు. ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ ప్రతి నిర్మాణం చేపడుతున్నామని సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. చరిత్రలో సుమారు 250 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడకుండా పనులు చేపట్టేలా ప్రతినిత్యం సమీక్షిస్తున్నామని నిత్యం మంత్రుల బృందం పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తికానున్నాయని. తెలిపారు గతంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సందర్శించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు ఆదివాసీలు ఆలయాన్ని విస్తరించాలని కోరగా అధికారంలోకి రాగానే తప్పకుండా ఆలయాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చి నేడు నిలుపుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి 251 కోట్లు మంజూరు చేశారని మేడారం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని పనులను వేగవంతం చేస్తున్నారని నిత్యం నిర్మాణం పనులను సమీక్ష చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్ హాయంలో తాత్కాలిక పనుల పేరిట నిధులను ఖర్చు ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం పక్కా పకడ్బందీ వ్యూహంతో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని చెప్పారు. చరిత్రలోనే కనివీని ఎరుగని రీతిలో ఈ దఫా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని భక్తులంతా సహకరించాలని పేర్కొన్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నామని. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుందన్నారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి అని వివరించారు గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం ఉంటుంధని తెలిపారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా వివరించారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు చెక్కించామని పేర్కొన్నారు. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల బొమ్మలుంటాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 250 మంది శిల్పులు పనిచేశారనీ, స్థపతులు ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ మోతీలాల్ పర్యవేక్షిస్తున్నారనీ చెప్పారు సమ్మక్క-సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ చిత్రాల రూపకల్పనలో సాయం అందించారని పేర్కొన్నారు.గద్దెల ప్రాంగణానికి సమీపంలో ఇదివరకు ఉన్న చెట్లను దాదాపు తొలగించకుండానే అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వనదేవతల పూజల్లో విశిష్టత కలిగిన బండారి, మర్రి, వెదురు, బూరుగ, వేప, ఇప్ప, కస్తు వంటి 12 రకాల చెట్లు, 140 రకాల ఆయుర్వేద మొక్కలు నాటనున్నామని పేర్కొన్నారు. మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నది. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏది అవసరం పడిన వెంటనే తెప్పిస్తున్నారు. అధికారుల పురమయిస్తూ పనులు వేగవం తానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలో అన్ని పనులు పూర్తీ అవుతాయి.మంత్రుల బృందాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులకు ఆదేశాలిస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. ఈసారి సమ్మక్క సారలమ్మ జాతరను బ్రహ్మాండంగా విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రుల బృందం ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్నది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, స్థపతి శివనాజిరెడ్డి, మైపథి అరుణ్ కుమార్, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మన్మోహన్ సింగ్‌కు సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, డిసెంబర్ 26 :** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మొదటి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఘనంగా నివాళి అర్పించారు. మన్మోహన్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జూబ్లీ హిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి సిఎం తదితరులు నివాళులు అర్పించారు. ఈ క్రయక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డిలు ఉన్నారు.

## ఎప్పటికైనా సొంతింటికి వెళ్లాల్సిందే

- ఢిల్లీ నాయకత్వం పిలుపుకోసం ఎదురు చూస్తున్నా
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్, డిసెంబర్ 26 :** ఎమ్మెల్యే రాజాసింగ్ మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఎప్పికైనా సొంతింటికి వెళ్లక తప్పదని చెప్పారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఒక అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే.. ఏదో ఒక రోజు అతను ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. అలాగే తాను కూడా ఈ రోజు కాకపోయినా రేపైనా తన ఇంటికి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో చెప్పలేనంటూ దాటవేశారు. తాను బీజేపీకినిజమైన సైనికుడిని అని తెలిపారు. ఢిల్లీ లేదా రాష్ట్ర నాయకులు తనను పిలిచిన రోజున తిరిగి పార్టీలోకి వస్తానని తేల్చి చెప్పారు. ఇంతకు ముందు కూడా తాను ఇదే అభ్యర్థన చేశానని.. ఇప్పుడు కూడా అదే అభ్యర్థన చేస్తున్నానని చెప్పారు. అసెంబ్లీలో స్వేచ్ఛ కల్పించాలని, ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీకి వారి నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇవ్వాలని.. అప్పుడే బీజేపీ భవిష్యత్తులో అధికారంలోకి రాగలదని రాజాసింగ్ అన్నారు. ఈరోజు కాకపోయినా రేపైనా తనకు ఢిల్లీ పెద్దల నుండి లేదా రాష్ట్ర పెద్దల నుంచి పిలుపు వస్తుందని ఖచ్చితంగా తెలుసని చెప్పారు. వారి నుంచి ఫోన్ వస్తే.. తాను ఒకటే ఒక రిక్వెస్ట్ చేస్తానని అన్నారు. తమకు పార్టీ పెద్ద నాయకులు నుంచి స్వేచ్ఛ ఇవ్వండి అని కోరతానని చెప్పారు. అలా స్వేచ్ఛ ఇచ్చిన తర్వాత.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో తాము ఏ విధంగా యుద్ధం చేస్తామో అంతా చూస్తారని రాజాసింగ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ కొంతకాలం క్రితం బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ఏ పార్టీలో చేరకుండా ఒంటరిగానే ఉన్నారు. అయితే ఇటీవల ఆయన తిరిగి మళ్లీ బీజేపీలో చేరతారంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఈ విషయమై ఆయన..పార్టీ అగ్రనేతలతో చేసిన చర్చలు సఫలమైనట్లు కూడా తెలుస్తోంది. నెల రోజుల్లో ఆయన కాషాయ కండువా కప్పుకోవచ్చనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజాసింగ్ వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి.

## వేయిస్తంభాల గుడిని సందర్శించిన అడ్వకేట్ జనరల్

**హనుమకొండ, డిసెంబర్ 26 :** చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వారి సతీమణి బంధువులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికి ఉత్తిష్టగణపతికి దర్శనం అనంతరం రుద్రేశ్వరస్వామికి వారి గోత్రనామాలులతో లఘు రుద్రాభిషేకం నిర్వర్తింపజేసి ఆలయ నాట్యమండపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్‌కుమార్ తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. వేదఆశీర్వచనం నిర్వర్తించి ఆలయప్రాశిస్తాన్ని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేందర్‌శర్మ వారికి వివరించారు. సూర్య, విష్ణు ఆలయాల చరిత్ర నాట్యమండపం, స్తంభాలపై వెంట్రుక పట్టే అటువంటి రంధ్రాలు, జిట్టెడు ఆంజనేయస్వామి, తలకిందులచాప తలకిందుల మనిషి, అష్టదిక్పాలకులు గాయత్రిమాత, కళ్యాణమండపం విశేషాలను వారికి వివరించారు. వారు అద్భుతమైన శిల్పకళా అని తెలంగాణ రాష్ట్రంలో ఉండడం మనకు గర్వకారణమన్నారు. కాకతీయులు భారత సంస్కృతిని సాంప్రదాయాన్ని ప్రతిబింబించేవిధంగా అద్భుత శిల్పకలని అందించారని ఆయన పేర్కొన్నారు. వారసత్వ సంపదలను సమాజం కాపాడుకోవాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్‌శర్మ, సందీప్‌శర్మ, మణికంఠశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలను నిర్వర్తించారు. వారికి ఆలయ సిబ్బంది మధుకర్, రజిత,రామకృష్ణ సేవలందించారు. సెలవుదినం కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చారు.

## పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

**జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 26 :** పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి మాటలను కాంగ్రెస్ నాయకులే వెక్కిరిస్తున్నారని, కనుకనే ఆ పార్టీలో భవిష్యత్ లేదని కేసీఆర్ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమని పేర్కొన్నారు.

## ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదం : టెక్కీ మృతి

**హైదరాబాద్, డిసెంబర్ 26 :** అతివేగం ఓ యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువ సాఫ్ట్‌వేర్ ప్రాణాలు కోల్పోయాడు. వరంగల్ జిల్లాకు చెందిన పునీత్ యాదవ్ (23) గౌలిదొడ్డిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై పునీత్, అతడి స్నేహితుడితో కలిసి గౌలిదొడ్డి నుంచి గచ్చిబౌలికి వస్తున్నాడు. అయితే పునీత్ వేగంగా బైక్‌ను నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో పునీత్, అతడి స్నేహితులు కిందపడిపోయారు. బైక్ నడుపుతున్న పునీత్ యాదవ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న అతడి స్నేహితుడు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడ్డ వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే పునీత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## బీఆర్ఎస్ పార్టీ టైర్ పంక్చర్ అయ్యింది

- గజ్వేల్ నియోజకవర్గంలోనే సర్పంచ్‌లు గెలవలేదు
- కేసీఆర్‌కు అందుకే గుబులు పట్టుకుంది
- మంత్రి వివేక్ వెంకటస్వామి ఎద్దేవా

**మెదక్, డిసెంబర్ 26 :** బీఆర్ఎస్ పార్టీ టైర్ పంక్చర్ అయ్యిందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అందుకే కేసీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మెదక్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి.. గజ్వేల్ లో తొంబైకి పైగా స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు సర్పంచులుగా గెలిచారని అన్నారు. దీంతో కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని ఎద్దేవా చేశారు. ఓటమిని భరించలేక తోలు తీస్తా అని కాంగ్రెస్ పార్టీ మీద విమర్శలకు దిగుతున్నారని అన్నారు. కేసీఆర్ తనను గెలిపించిన గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోలేదు కానీ తోలు తీస్తాడంట. గతానికంటే ఎక్కువగా దుబ్బాక లో 56 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. సిద్దిపేటలో సర్పంచ్ క్యాండిడేట్ దొరకడమే కష్టంగా ఉండేది.. కానీ ఇప్పుడు ప్రతి స్థానంలో అభ్యర్థిని పెట్టాం కొన్ని గెలిచాం అన్నారు. కార్యకర్తల కష్టం వల్లే ఇన్ని స్థానాలు గెలుపొందాం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకాలపై ప్రజలలో మంచి స్పందన ఉందన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండి వారి కష్టాలు, సమస్యలు తెలుసుకోండి. అప్పుడే నాయకుడికి ప్రజలకు మధ్య బాండింగ్ ఏర్పడుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎక్కువ నిధులు , ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వమని ముఖ్యమంత్రి కోరానని అన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు బలం లేదు అన్నారు.. ఇరవై వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందాం. గెలిచిన సర్పంచులందరినీ ముఖ్యమంత్రితో కలిపిస్తా.. మీ శ్రమ గొప్పది.. కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ సర్పంచ్ ఎన్నికల్లో చూపించారని వారిని అభినందించారు.


## ప్రభుత్వంపై కేసీఆర్ సమరశంఖం

- నిధులు, నీళ్లు, నియామకాలపై మరోమారు జంగ్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ బహిరంగ సభలు
- పాలమూరు-రంగారెడ్డికి అన్యాయంపై నిలదీసే యత్నం
- మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలతో సమీక్ష



**గజ్వేల్, డిసెంబర్ 26 :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు సమరశంఖం పూరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిన నేపథ్యంలో, మళ్లీ 'నీళ్లు-నిధులు-నియామకాలు' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారు. సిఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచే సమరం పూరించాలని చూస్తున్నట్లుగా తెలుస్తోంది. శుక్రవారం ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలతో ఆయన సుదీర్ఘంగా సమావేశమై పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేశారు. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ నీటి కేటాయింపులకు అంగీకరించడం ద్వారా దక్షిణ తెలంగాణ రైతాంగానికి తీరని అన్యాయం చేస్తోందని కేసీఆర్ మండిపడ్డారు. ఈ అన్యాయాన్ని ఎండగట్ట డమే కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యపరచడానికి మూడు ఉమ్మడి జిల్లాల్లో మూడు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పరిగిలో ఒక సభను, నల్గొండ జిల్లాలోని దేవర కొండ లేదా కొండమల్లేపల్లిలో రెండో సభను, మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యంత భారీ స్థాయిలో మూడో సభను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.రాబోయే అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ బహిరంగ సభలను ప్రారంభించాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశర చేశారు. సంక్రాంతి పండుగ కంటే ముందే ఒక సభను నిర్వహించి, పండుగ తర్వాత మిగిలిన రెండు సభలను పూర్తి చేయాలా? లేక మూడు సభలను సంక్రాంతి తర్వాతే వరుసగా నిర్వహిం చాలా అనే అంశంపై తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ముఖ్యంగా ఈ మూడు సభలకు కేసీఆర్ స్వయంగా హాజరై ప్రసంగించబోతుండటంతో అటు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గత పదేళ్ల తమ పాలనలో చేసిన అభివృద్ధిని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పోలుస్తూ ప్రజల్లోకి వెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వెనకడుగు వేయకూడదని ఆయన నేతలకు స్పష్టం చేశారు. ఈ సభల ద్వారా దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును తిరిగి నిరూపించుకోవాలని చూస్తోంది.

# ఆరావళికి విజయోస్తు!



ఆరావళిపై సాగుతున్న అరాచకంపై ప్రజలు మేల్కొని ఉద్యమబాట పట్టడంతో కథ అడ్డం తిరిగింది. అంటే ప్రజా ఉద్యమాలకు బలం ఉ ందని తేలింది. ప్రజా ఉద్యమాలను న్యాయస్థానాలు సైతం అంగీకరిస్తున్నాయి. అందువల్ల సమస్యలపై ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పోరాటం చేయాల్సిందేనని ఆరావళి మనకు హెచ్చరించింది. ఇది ఆరంభంగా తీసుకోవాలి. దేశంలో ఎక్కడిక్కడ ప్రజలు దేశ పర్యావరణ విధ్వంసంపై ఉద్యమించాలి. నదుల అనుసంధానం ద్వారా నీటి వృధాను అరికట్టేందుకు నడుం బిగించాలి. క్యాన్సర్ కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉ ద్యమించాలి. అన్నింటికి మించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పెద్ద ఉ ద్యమం అవసరం. ఇదంతా ఎందుకు చర్చించుకోవాలంటే ఆరావళిని కార్పోరేట్లకు ధారాదత్తం చేయాలన్న ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సుప్రీం ఆదేశాలతో అక్కడ తవ్వకాలకు స్వస్తి పలికింది.

సహజసిద్ధంగా, భారత్‌కు రక్షణ గోడలా ఉన్న ఆరావళి పర్వతాల్లో తవ్వకాలకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలు, ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ అనుకూల మీడియా సైతం వ్యతిరేకించడం విశేషం. ప్రజాందోళనలు అంతకంతకూ మృగ్యమైపోతున్న ప్రస్తుత కాలంలో ఉదయ్‌పూర్ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం రాజుకోవడం, పర్యావరణవేత్తలు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా తమను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆరావళిని కాపాడేందుకు నడుం బిగించారు. కార్పొరేట్ లాభాలు తాత్కాలికమైనవి. పర్యావరణ నష్టాలు శాశ్వతమైనవని గుర్తించారు. అందుకే ఆరావళి జోలికి రాకుండా ఉద్యమించారు. ఢిల్లీ కాలుష్యంలో ఊపిరిసలుపక అవస్థలు పడుతున్న కేంద్ర పెద్దలు అరావళిని తమ తాబేదార్లకు తెగనమ్మే దిశగా అడుగులు వేయడం విస్మయం కలిగించక మానదు. ఎందుకంటే ఇప్పటికీ ఢిల్లీ కాలుష్య నివారణపై కదలిక కానరావడం లేదు. కాలుష్యం మూలాలను కనిపెట్టడం లేదు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తున్నా, ప్రజలు ఆందోళన చెందుతున్నా కార్యాచరణ శూన్యం ఈ దశలో ఆరావళిపై జరిగిన పోరాటం గుర్తుకు తెచ్చుకోవా ల్సిందే. ఆలస్యంగానైనా లెంపలు వేసుకుని అరావళి రక్షణపై, ముఖ్యం గా గనుల తవ్వకంపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఉ త్తర్వులు జారీచేయడం ప్రజాభీష్టానికి లభించిన ఘనవిజయంగా చూడాలి. ప్రజల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని నిరూపితం అయ్యింది. ర్యావరణ పరిరక్షణకూ అప్రమత్తతే రక్షణ కవచమని ఇప్పుడు ఆరావళి సాక్షిగా తేలిపోయింది. ఆరావళి పర్వతాలకు ప్రస్తుతానికైతే ముప్పు తప్పింది. కార్పొరేట్ గద్దలకు ప్రకృతి సంపదను దోచిపెట్టాలన్న దురాలోచన వెనుకపట్టు పట్టింది.

ఎత్తు పేరుతో పర్యావరణాన్ని చిత్తు చేయాలన్న ఎత్తుగడ ప్రజాగ్రహం ముందు వీగిపోయింది. ఎడతెగని రైతుల పోరాటం ఫలితంగా కార్పొరేట్లకు సాగును కట్టుబానిసను చేయాలన్న పన్నాగం విఫలమై నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నట్టే, దేశవ్యాప్తంగా రగులుతున్న ఆరావళి నిరసనలకు తలొగ్గి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఎక్కడో పర్వతాలు, అడవులు.. ఎవరు తవ్వుకుంటే మనకేమి అనుకునే రోజులు కావివి. భూమి మీద ఉండే ప్రతి పుట్టా, చెరువూ దేనికవే పర్యావరణ వ్యవస్థలకు ఆయువుగా నిలిచి ప్రాణాధారాలుగా పనిచేస్తాయి. భూమి మీదున్న అతిపురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళికి ఉన్న ప్రాముఖ్యం తెలియంది కాదు. మన పురాణాలు, ఉపనిషత్తులు, వేదాల్లో దీని ప్రస్తావన ఉంది. మన దేశానికి ఉత్తరాన పెట్టని కోటగోడలా నిలుస్తున్న హిమాలయాల కంటే ఆరావళి పర్వతాలే పురాతనమైనవి. దాదాపు 700 కిలోమీటర్ల పొడవున్న ఈ పర్వతశ్రేణి మరో రకంగా రక్షణ దుర్గంలా నిలుస్తున్నది. పడమర నుంచి తూర్పు ప్రాంతాలకు వీచే వేడిగాలుల ప్రభావాన్ని తగ్గించి, థార్ ఎడారి విస్తరణకు లక్ష్మణరేఖలా నిలువడం దీని ప్రత్యేకత. రాజస్థాన్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలను చల్లగా చూసే కొండదేవరగా ఆరావళిని చెప్పుకోవచ్చు. ఇక కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశ రాజధాని ఢిల్లీకి ఊపిరితిత్తుల్లాంటివని చెప్పకతప్పదు. అలాంటి ఆరావళిని కార్పొరేట్, రియల్ ఎస్టేట్ శక్తులు ఇప్పటికే మైనింగ్‌తో, చెట్ల నరికివేతతో చెరపట్టి చేయాల్సిన నష్టం చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వాలు వేల ఎకరాల అడవులను ధ్వంసం చేస్తున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన కేంద్రం మరింతగా దూకుడు పెంచి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని చూసింది. దీనివల్ల మనకు తీరని నష్టం అని తెలిసినా పట్టించుకోలేదు. ఆరావళిని అంగడి సరుకుగా మార్చేందుకు, గనుల తవ్వకానికి రాచబాట పరిచేందుకు మోదీ సర్కార్ చేసని ప్రయత్నాలపై దెబ్బపడింది.

వంద మీటర్ల ఎత్తువరకు మాత్రమే తవ్వకాలు జరపొచ్చని, అంతకన్నా ఎత్తున్నవి మాత్రమే పర్వతాలుగా పరిగణించాలని వితండవాదం చేసింది. శాస్త్రీయ విధానంలో ఏది అడవి, ఏది కాదనేది తేల్చిచెప్పాల్సిన కేంద్రమే ఎత్తును బట్టి అనుమతులను నిర్ధారించడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి తోవ వేసింది. ఎత్తును బట్టి ఆరావళి పర్వతాలకు నిర్వచనమిచ్చే విధానాన్ని సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా నియమించిన కమిటీ కూడా తిరస్కరించింది. దాన్ని తోసిరాజని కోర్టు ముందు సలహాదారుగా ఆ ప్రతిపాదనే ఉంచి పక్కదారి పట్టించింది. అయితే ప్రజా ఉద్యమాన్ని కోర్టు కూడా పరిగణించింది. ఆరావాళి జోలికి వెళ్లవద్దని తేల్చింది. ఆయా రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో ఢిల్లీ కాలుష్యంపై ప్రజలు పోరాడాలి. అప్పుడే దేశానికి విముక్తి కలుగుతుంది. కాలుష్యంతో ఢిల్లీలో ఉండలేక పోతున్నానని కేంద్రమంత్రి నితిని గడ్కరీ స్వయంగా చెప్పడం చూస్తుంటే ఢిల్లీలో ఎంతటి దారుణ పరిస్థితులు ఉ న్నాయో గమనించవచ్చు. అందువల్ల కేంద్రమే స్వయంగా రంగంలోకి దిగి రాజధానిని కాలుష్యం నుంచి బయటపడేసే మార్గాలను వెతకాలి.

# రేవంత్ మెరిట్ కోటా సీఎం

## కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా మంత్రి

- కేటీఆర్ పిట్టకథలు చెప్పి రాష్ట్రాన్ని దోచాడు
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో ప్రజలు బుద్ధి చెప్పారు
- కేటీఆర్ ఇకనైనా విమర్శలు మాని నిర్మాణాత్మకంగా పనిచేయాలి
- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా




**హైదరాబాద్, డిసెంబర్ 26 :** రేవంత్ రెడ్డి మెరిట్ కోటాలో సీఎం అయితే... నువ్వు మేనేజ్‌మెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చావంటూ కేటిఆర్‌ను ఉద్దేశించి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. అదే కోటాలో వచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యే అయి.. మంత్రి అయ్యావంటూ వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా జడ్పీటీసీ, ఎమ్మెల్యేగా గెలిచారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా గెలిచి.. ప్రస్తుతం సీఎం అయ్యారని వివరించారు. మెరిట్ కోటా, పేమెంట్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా ఎవరిదో తెలంగాణ ప్రజలకు తెలుసునన్నారు. పీసీసీ అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి అయిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. ఎప్పుడు అధికారం తమకే ఉంటుందని బీఆర్ఎస్ హయాంలో నియంత పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని రేవంత్ రెడ్డి ఓడించి ఇంటికి పంపారని చెప్పారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చేతిలో మీకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి ఛాలెంజ్ స్వీకరించాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఐరెన్ లెగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అని అభివర్ణించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి గుండుసున్నా వచ్చిందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో తాను ఏదో పొడిచానని చెప్పుకున్న కేటీఆర్‌ను కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టారని గుర్తు చేశారు. పిచ్చి ఆలోచనలు మానుకోవాలంటూ కేటిఆర్‌కు ఆయన హితవు పలికారు. నిర్మాణత్మక ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషించాలంటూ బిఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకుని రావాలంటూ కేటీఆర్‌కు తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ప్రధాన ప్రతిపక్ష నేత హోదాను కేటీఆర్ తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. తద్వారా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. తాను బూతులు మాట్లాడతానంటూ కేటీఆర్ అంటున్నారన్నారు. కట్టే, కొట్టే, తెచ్చే అనేది మీ కుటుంబానికి వర్తిస్తుందంటూ కేటీఆర్‌కు తెలిపారు. నీళ్లు, నిధులు, నియామ కాల పేరుతో తెలంగాణ ప్రజలను మీరు వంచించ లేదా? అని కేటిఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమకారుడి అవతా రం ఎత్తి, పిట్ట కథలు కట్టి, సీఎం పదవిని అధికారాన్ని చేపట్టి.. రాష్ట్రాన్ని అప్పుల చేసి మీ కుటుంబానికి సంపద తెచ్చారని విమర్శించారు. హైడ్రా చేస్తున్న పనుల పట్ల హైదరాబాద్ నగర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో నాలాలను కబ్జాలు చేసి ఇళ్ళు నిర్మించారని.. దాంతో వానాకాలం వస్తే ఇళ్లనీ మునిగి ప్రజలకు ఆస్తి నష్టం వాటిల్ల లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాలనీలు, పార్కులను కబ్జాలు చేసి దండుపాళ్యం ముఠాలా దోచుకున్నారని మండిపడ్డారు. మీరు కబ్జాలు చేసి దోచుకున్న వాటిని హైడ్రా కూల్చివేస్తుందని హెచ్చరించారు. ప్రజల కోసం హైడ్రా కూల్చివేతలు చేపడుతోం దని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇళ్ళు ప్రజలకు ఇచ్చారా..? అని కేటీఆర్‌ను ఈ సంద ర్భంగా ఆయన నిలదీశారు. కోటి మంది మహిళలను కోటీశ్వ రులను చేయడం అంటే నగదు ఇవ్వడం కాదని.. మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం ద్వారా కోటి మంది మహి ళలు కోటీశ్వరులు అవుతారని కేటీఆర్‌కు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సోదాహరణగా వివరించారు.

# కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు

- ప్రేమించి పెళ్లి చేసుకున్నా.. నిత్యం అనుమానమే
- పెట్రోల్ పోసి భార్యకు నిప్పటించిన దుర్మార్గుడు



**హైదరాబాద్, డిసెంబర్ 26 :** హైదరాబాద్ నగరంలోని నల్లకుంటలో దారుణం జరిగింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అనుమానంతో ఓ కిరాతకుడు దారుణంగా హత్య చేశాడు. అది కూడా పిల్లల ముందే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. అడ్డువెళ్లిన కూతురును కూడా మంటల్లోకి తోయగా ఆమె తృటిలో తప్పించుకుంది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. నల్గొండ జిల్లా హుజురాబాద్‌కు చెందిన దంపతులు వెంకటేశ్, త్రివేణి నల్లకుంటలో నివాసం ఉ ంటున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను వెంకటేశ్ తరచూ అనుమానిస్తుండే వాడు. ఈ విషయంపై భార్యను తీవ్రంగా వేధించేవాడు. వారి మధ్య తరచూ గొడవలు జరిగేవి. తాజాగా భర్త వేధింపులు తాళలేక భార్య త్రివేణి పుట్టింటికి వెళ్లింది. దీంతో అక్కడికి వెళ్లిన వెంకటేశ్.. తాను మారానని, ఇకపై బాగా చూసుకుంటానంటూ నమ్మించి త్రివేణిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. అయితే తీసుకొచ్చిన కొద్దిరోజులకే ఆమెను అతి దారుణంగా చంపేశాడు. ఎప్పటిలాగే అనుమానంతో భార్యతో గొడవకు దిగి విచక్షణ మరిచి ఆమెపై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా త్రివేణిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అడ్డుకున్న కూతురినీ మంటల్లో తోసేసిన వెంకటేశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. అరుపులు, కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసి ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే త్రివేణి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కూతురు స్వల్పగాయాలతో బయటపడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించారు. కేవలం 12 గంటల్లోనే వెంకటేశ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాగా చూసుకుంటానని నమ్మించి తమ కుమార్తెను ఇలా దారుణంగా చంపేశాడంటూ త్రివేణి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అనుమానంతో భార్యను హత్య చేసి భర్త జైలు పాలవడంతో.. ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. తల్లి కోసం చిన్నారులు విలపిస్తున్న తీరు అక్కడి వారిని తీవ్రంగా కలిచివేసింది.

# గుజరాత్ కచ్‌లో స్వల్ప భూ ప్రకంపనలు

**గాంధీనగర్, డిసెంబర్ 26 :** గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భూ ప్రకంపనలు సంభవించాయి. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ప్రకంపనలు వచ్చాయి. ఈ భూ ప్రకంపనల తీవ్రత రిక్టర స్కేలుపై 4.4 గా నమోదు అయింది. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూ ప్రకంపల కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది. 23.65 డిగ్రీల నార్త్ లాటిట్యూడ్, 70.23 ఈస్ట్ లాంగిట్యూడ్ మధ్య 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలు సంభవించిన వెంటనే ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రకపంనల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని ఉన్నతాధికారులు వివరించారు. మరోవైపు ఈ కచ్ జిల్లాలో తరచూ భూ ప్రకంపనలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. కానీ స్వల్ప భూ ప్రకంపనలతో ఇక్కడ భూకంపాలు సంభవిస్తున్నాయి. 2001లో గుజరాత్‌లో భారీ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. ఈ సంద ర్భంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోగా.. లక్షలాది మం ది గాయపడ్డారు. ఈ వరుస భూప్రకంపనల కారణంగా.. స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# హెచ్-1 వీసాల్లో జాప్యంతో తీవ్ర ఆందోళన

- సమస్యను అమెరికా దృష్టికి తీసుకుని వెళ్లాం
- విదేశాంగాశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26 :** అమెరికా హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్ల షెడ్యూలింగ్‌లో జరుగుతున్న విపరీతమైన జాప్యం, ఆకస్మిక రద్దులపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. వేలాది మంది భారతీయ నిపుణులు, విద్యార్థులు ఈ సమస్య వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. ఢిల్లీ, వాషింగ్టన్‌లోని అమెరికా అధికారులతో ఈ విషయంపై చర్చించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా వీసా ప్రక్రియలో నెలకొన్న అనిశ్చితి వల్ల భారతీయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా డిసెంబర్ 15 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. వీసా దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్ చేయాల్సి రావడం, క్షుణ్ణమైన తనిఖీల వల్ల పక్రియ నెమ్మదించింది. దీనివల్ల గతంలో కొన్ని వారాల్లో పూర్తయ్యే స్టాంపింగ్ పక్రియ ఇప్పుడు ఏకంగా 2026 వరకు రీషెడ్యూల్ అవుతున్నాయి. ఈ జాప్యం వల్ల వందలాది మంది టెక్కీలు సెలవులపై భారత్‌కు వచ్చి, తిరిగి వెళ్లలేక ఇక్కడే చిక్కుకుపోయారు. కేవలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కాకుండా వారి కుటుంబ సభ్యులు ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులు కూడా ఈ జాప్యం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. అనేక మందికి ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉండగా, విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. గూగుల్, ఆపిల్ వంటి దిగ్గజ సంస్థలు కూడా తమ భారతీయ ఉద్యోగులకు వీసా స్టాంపింగ్ లేనిదే ప్రయాణాలు చేయవద్దని ఇప్పటికే అంతర్గత హెచ్చరికలు జారీ చేశాయి. అమెరికా వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తమకు అనేక ఫిర్యాదులు వచ్చినట్లు భారత విదేశాంగశాఖ పేర్కొంది. ఈ అంశం అమెరికా సార్వభౌమాధికార పరిధిలోనిదే అయినప్పటికీ.. తమ ఆందోళనలను అమెరికా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. కెనడాలో గుండెపోటు కారణంగా భారత సంతతి వ్యక్తి ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఘటనపైనా భారత్ స్పందించింది. ఆయన భారత సంతతి వ్యక్తే అయినప్పటికీ.. అతడికి కెనడా పౌరసత్వం ఉందని స్పష్టం చేసింది. ఆ విషయంలో కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొంది. తీవ్ర ఛాతీనొప్పితో తన భర్తను ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ చికిత్స కోసం దాదాపు ఎనిమిది గంటలు వేచిచూడాల్సి వచ్చిందని, చివరకు ప్రాణాలు కోల్పోయారని బాధితుడి భార్య నిహారికా శ్రీకుమార్ ఆరోపించిన విషయం తెలిసిందే.

# 42శాతం రిజర్వేషన్లతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

సీఎం రేవంత్‌కు ఆర్. కృష్ణయ్య లేఖ



**హైదరాబాద్, డిసెంబర్ 26 :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న ఎంపీ టీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే నిర్వహిం చాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బీసీ భవన్‌లో ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేసిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన సర్పంచి ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు చేసిన తర్వాత నిర్వహించాలని కోరారు. అలా చేయకుండా ఎన్నికలకు వెళితే జాతీయ బీసీ సంక్షేమ సం ఘం తరపున పెద్దఎత్తున బీసీ ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరిం చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డిసి ప్రకారం స్థానిక సంస్థలలోని బీసీ రిజర్వేషన్ పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉ ందన్నారు. బీసీలకు ఇచ్చిన హామీని సీఎం అమలు చేసి మాట నిలుపుకోవాలని, లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వివాహితకు వేధింపులు

వ్యక్తిని చెప్పలతో కొడుతూ పోలీసులకు అప్పగింత

**నిజామాబాద్, డిసెంబర్ 26 :** వివాహితను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాన్సువాడలో ఓ మహిళను ఏనుగు రవీందర్ రెడ్డి ప్రధాన అనుచరుడైన దేవేందర్ రెడ్డి కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం సదరు మహిళ ఆమె భర్తకు చెప్పడంతో దేవేందర్ రెడ్డికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో దేవేందర్ రెడ్డిపై ఎస్టీ,ఎస్టీ అట్రాసిటీతో పాటు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. బాన్సువాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిలను దేవేందర్‌రెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడు. నెలరోజులుగా దేవేందర్‌రెడ్డి వేధింపులు భరించలేక సదరు మహిళ తన భర్తకు విషయం చెప్పింది. గురువారం కూడా మహిళను దేవేందర్‌రెడ్డి వేధిస్తుండగా ఆమె భర్త అక్కడికి చేరుకొని అతడిని పట్టుకున్నాడు. తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన దేవేందర్‌రెడ్డిని దవాఖాన నుంచి నడిరోడ్డుపై చెప్పులతో కొడుతూ పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లి, పోలీసులకు అప్పగించాడు. బాధితురాలిని, ఆమె భర్తను కాంగ్రెస్ నాయకుడు బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కు వెళ్లినట్టు సమాచారం.

# వైద్యులు అందుబాటులో ఉండాలి

టెక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**మెదక్, డిసెంబర్ 26 :** వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. టేక్మాల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ, ఫార్మసీ, ల్యాబ్, టాయిలెట్స్, పరిశీలించారు. వైద్యులు, అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికి అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## గ్రామ అభివృద్ధి ధ్యేయంగా దూసుకుపోతున్న సర్పంచ్ అంతటి భగవంతు

**మోత్కూర్, రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల పరిధి లోని పాలడుగు గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి సర్పంచిగా గెలిచిన తొలి రోజు నుండే గ్రామ అభివృద్ధి దిశలో దూసుకుపోతున్న అంతటి భగవంతు గ్రామంలో ఉన్న ప్రతి సమస్య నా సమస్యగా భావిస్తూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా గ్రామంలో ఉన్న సమస్యలు సిసి రోడ్లు, డ్రైనేజీ,వీధిలైట్లు,రేషన్ కార్డులు,పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని గ్రామ ప్రజలకు అందే విధంగా చూస్తానని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి వార్డు తిరుగుతూ వార్డులో ఉన్న సమస్యలన్నిటిని తెలుసుకొని పరిశుభ్రత చేస్తున్నాడు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు గ్రామ సిబ్బంది గ్రామ ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పథంలో సంక్షేమ పథకాలు

### ప్రజా పాలన ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రజాపాలన ప్రజలకు సంక్షేమ పథకాలు రాష్ట్ర అభివృద్ధిలో తలదైన శైలిలో నిత్యం ప్రజా పౌర సమాజ సంక్షేమానికి అండగా ఉంటున్నాయి. రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రజల గుండెల్లో పెట్టుకుంటున్నారని ముఖ్యమంత్రి ప్రజా పాలన వ్యవహారాల ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి అన్నారు. నరేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సంగారెడ్డి జిల్లా బొల్లారం పటాన్చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొలుకూరి నరసింహారెడ్డి డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పర్వ శ్యామ్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు నవారి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉపాధ్యక్షుడు గంగాధరరావు రవి గౌడ్ లు కలిసి వేం నరేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.



## గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు ఇస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని పల్లెర్ల గ్రామ సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్ మాట్లా డుతూ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనలో గ్రామ ల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద గ్రామ పంచాయతీలకు 10లక్షలు చిన్న గ్రామపంచాయతీకి 5లక్షలు ఇస్తున్న ప్రజా ప్రభుత్వానికి గ్రామ సర్పంచ్ గా చాలా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## సొంతనిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

### బచ్చోడులో ఇచ్చిన మాటకు కట్టుబడి 7,9 వార్డులలో అభివృద్ధి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** బచ్చోడు గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గుజ్జ రామకృష్ణ,సందు రాజు 7,9 వార్డులలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బచ్చోడు గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరఫున 7వ వార్డులో గుజ్జ రామకృష్ణ, 9వ వార్డులో సందు రాజు పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించగా, తమ వార్డులో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ వార్డులను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇవ్వటంతో గెలుపొందిన వెంటనే 7,9 వార్డులలో గ్రావెల్ తో గుంటలను పూడ్చి వార్డుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో వార్డులో ఉన్న ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినందుకు 7,9 వార్డుల ప్రజలకు రుణపడి ఉంటామన్నారు.వార్డుల అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో గ్రామ పంచాయతీని కైవసం చేసుకొని గ్రామ అభివృద్ధి కూడా పాటుపడతామని ఆశాభం వ్యక్తం చేశారు. కొందరు స్వార్థపరుల వల్ల గ్రామపంచాయతీ స్వల్ప ఓట్ల తో పరాజయం చెందామని ఇప్పటికైనా ప్రజలు ఎంతో చైతన్యంతో ఆలోచించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ ఓట్లను వినియోగించుకున్నారని స్వల్ప మెజార్టీతో సర్పంచ్ అభ్యర్థిని కోల్పోయామని ఆయన అన్నారు.

## నూతన సర్పంచ్‌లు ప్రజల ఆశలకు ప్రతినిధులుగా నిలవాలి

- అనిశెట్టిపల్లి-ఆళ్లపల్లి డబుల్ రోడ్డుకు రూ.90 కోట్లు
- 9 మంది సర్పంచ్‌లు, 5 మంది ఉప సర్పంచ్‌లకు సన్మానం
- వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ఆళ్లపల్లి, రాజముద్ర న్యూస్ :** ఆళ్లపల్లి మండలంలో ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిని ప్రథమ కర్తవ్యంగా తీసుకుని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడే పాలనకు విలువ పెరుగుతుందని ఆయన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన 9 మంది సర్పంచ్‌లు, 5 మంది ఉప సర్పంచ్‌లు, 50 మంది వార్డు సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని చాటుతున్నాయని తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పదవుల కోసం కాకుండా ప్రజాసేవ కోసం పనిచేసే రాజకీయానికి ఇచ్చిన మద్దతుగా భావించాలన్నారు. కార్యకర్తల కష్టానికి, ఓటర్ల ఆశయాలకు ప్రతిఫలంగా ఈ విజయం నిలిచిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను నేరుగా వినే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీ బలమని, ప్రజల మధ్యే ఉండే రాజకీయమే తమ విధానమని స్పష్టం చేశారు. మండల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే, అనిశెట్టిపల్లి నుంచి ఆళ్లపల్లి వరకు డబుల్ రోడ్డుకు రూ.90 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. లొద్దిగూడెం-మర్కోడు మధ్య దెబ్బతిన్న రహదారిని పునరుద్ధరిస్తామని, అడవిరామరం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. మేడారం జాతరకు ముందు మర్కోడు-రేగళ్ల మార్గంలో మూడు చోట్ల కల్వర్టులను కాంక్రీటుతో నిర్మించనున్నట్లు చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే ఆళ్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు 108 వాహనం నిలుపుకునేందుకు ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామ నరసయ్య, సర్పంచ్‌లు వాసం సుస్మిత, కె. వెంకటేశ్వర్లు, ఎం. చంద్రశేఖర్, రమాదేవి, చిన్న పాపయ్య, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, సీనియర్ నాయకులు ఎండీ అతహార్, తులం ముత్తిలింగం, కె. సుధాకర్, బి. వెంకన్న, మహిళా అధ్యక్షురాలు గలిగ సమ్మక్క, మండల కో-ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్‌తో పాటు పలువురు నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా అట్టేపల్లి పురుషోత్తము శోభారాణి, రామ ప్రభు స్వప్నల వివాహ వార్షికోత్సవం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మియాపూర్ ప్రగతి ఎన్ క్లేవ్ వాస్తవ్యులు సాయి బాలాజీ ఇన్ఫ్రా సంస్థ అధినేతలు అట్టేపల్లి పురుషోత్తము శోభారాణి, రామ ప్రభు స్వప్నల వివాహ వార్షికోత్సవం ను మియాపూర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డి ఎస్ ఆర్ కే ప్రసాద్, బండారు రామచందర్ ముదిరాజ్ , పురుషోత్తం యాదవ్, సమ్మెట ప్రసాద్, మహేష్ యాదవ్, పుట్టా వినయ్ కుమార్ గౌడ్, బండారు గోపాల్ ముదిరాజ్, మోహన్ ముదిరాజ్, రాజేంద్ర ప్రసాద్, స్వామి, నాగరాజు, వల్లభనేని సత్యనారాయణ, బాబ్జి, వినయ్ ముదిరాజ్, ప్రశాంత్, ఉమాదేవి, సత్తి రెడ్డి, రాజశేఖర్, శ్రవణ్ కుమార్, వినోద్, శ్రీకాంత్, సతీష్, లతపాటు స్నేహితులు, శ్రేయోభిలాషులు, సాయి బాలాజీ ఇన్ఫ్రా సంస్థ ఉద్యోగులు, కలిసి దంపతులను శాలువాలతో సత్కరించి, పూల బొకేలను అందించి హృదయ పూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. మియాపూర్ విలేజ్ లోని సాయిబాబా ఆలయంలో ఏర్పాటు



చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ నుండి డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ప్రసాద్, ప్రసాద్ ఫౌండేషన్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, వెంకట్రావు, ఎం ఆర్ కే చౌదరి, వినోద్ చౌదరి, శ్రీకాంత్, పెద్దబాబు, కమలాకర్ రెడ్డి, అభిజిత్, ప్రసాద్, శేఖర్ నాయుడు, నాని, రామాంజనేయులు, రాము, పవన్ రెడ్డి, బొజ్జ రవికుమార్, సింహాచలం, బాలు తదితరులు అట్టేపల్లి దంపతులకు పెళ్లి రోజు సందర్భంగా వారిని కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

### సిపిఐ నాయకుడు ఎం ప్రభు లింగం

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు, రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం ప్రభు లింగం పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ చేవెళ్ల మండల కేంద్రంలో ఘనంగా సిపిఐ యొక్క జెండాను సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు, రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం ప్రభు లింగం సిపిఐ జెండాను ఆవిర్భవించారు. 100 సంవత్సరాలు సుదీర్ఘకాలం దేశంలో అనగారిన వర్గాల హక్కుల కోసం, దేశ స్వతంత్రం కోసం, దేశ స్వతంత్రం పోరాటంలో అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని, దేశ స్వతంత్రం కావాలని, బ్రిటిష్ వారు ఈ దేశం నుంచి వెళ్లిపోవాలని నిర్భయంగా పిలుపునిచ్చిన పార్టీ ఎర్రజెండా పార్టీ అని వారి సందర్భం కొనియాడారు. స్వతంత్ర అనంతరం కూడా దేశంలో బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం వారికి నిరంతరం అండగా ఉంటూ, వారి పక్షాన దున్నే వానికే భూమి అంటూ, రాజభరణాలు రద్దు చేయాలని రద్దు చేయాలని, పేద ప్రజలకు భూములు పంచాలని పోరాడిన పార్టీ సిపిఐ అని గుర్తు చేశారు. అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంలను ఎదిరించి పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి 4000 గ్రామాలను విముక్తిని చేసి, 4500 మందిని అమరవీరులను త్యాగం చేసిన పార్టీ ఎర్రజెండా పార్టీ అని గర్భంగా తెలిపారు. దేశానికి స్వతంత్రం వచ్చిన, ఇప్పటివరకు కూడా పేదల పక్షాన, కార్మికుల, రైతుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని, రైతులకు తెచ్చిన నల్ల చట్టాలను పార్లమెంటులో రద్దుచేసి వారి పక్షాన పోరాడిందని, కార్మిక హక్కులకు లేబర్ కార్డు కల్పించి వారికి ఇబ్బంది కల్పిస్తున్నటువంటి మోడీ ప్రభుత్వాన్ని కార్మికుల పక్షాన



పోరాటం చేసిందన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభ ముగింపు సభకు లక్షలాది మందితో జరుగుతున్న మహాసభను విజయవంతం చేయాలని, ఈ మహాసభకు 5 లక్షల మంది వరకు దేశవ్యాప్తంగా తరలిరానున్నట్టు, 42 దేశాల ప్రతినిధులు ఈ మాసభలో పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలో జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొనన్నారని అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి గ్రామ గ్రామం నుండి కార్యకర్తలు, వామపక్ష భావాలు గల నాయకులు హాజరుకావాలని వారి సందర్భంగా కోరారు. గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను బలోపేతం చేయాలని, బలోపేతం అయిన నాడే గ్రామాలలో అన్యాయాలపైన పోరాటాలు చేయగలుగుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి కె యం జిల్లా అధ్యక్షుడు జె అంజయ్య, రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం సుధాకర్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఐటీసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఇన్సఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మొయినాబాద్ మండల కార్యదర్శి కె శీను, చేవెళ్ల మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, షాబాద్ మండల మాజీ కార్యదర్శి నక్క జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి, కంది బైపాస్ రోడ్డులో కారు, ద్విచక్రవాహనం ఢీ

### ఇద్దరికీ తీవ్రగాయాలు, ఆసుపత్రికి తరలింపు

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్‌పల్లి, కంది బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనం కారు ఢీకొన్న సంఘటనలో ద్విచక్రం పైన ఉన్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయి ఆసుపత్రిలో చేరిన సంఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంకర్ పల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తేదీ శుక్రవారం రోజు



సమయం అందజగా 4 గంటలకి చేవెళ్ల వైపు నుంచి సంగారెడ్డి వైపుకు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని, చైతన్య స్కూల్ దగ్గర వెనుక వైపు నుంచి ఒక తెలుపు రంగు క్రెటా కారు డ్రైవర్ ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తి టక్కర్ ఇవ్వడం వల్ల ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మూసాపేట్ కు చెందిన చెరుకుపల్లి విష్ణు (21), నవీన్ (34) వ్యక్తులకు తీవ్ర గాయాలవ్వడంతో, ఇద్దరిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.



## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి రోడ్డుకు మొరం పోసిన నాయకులు

**రామారెడ్డి, డిసెంబర్ 26, రాజముద్ర న్యూస్ :** రామరెడ్డి గ్రామంలోని అతి పురాతమైన దేవాలయం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం (దేవరాల్లు) శ్రీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెళ్ళుటకు రోడ్ మార్గం బాగులేనందున శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం పాలక వర్గం గ్రామ పెద్దలు వారు గ్రామ సర్పంచ్ శ్రీ బండి ప్రవీణ్ కుమార్ కి అలాగే మూడో వార్డు సభ్యుడైన శ్రీ పిప్పరి లింబాద్రికి విన్నవించగా వెంటనే స్పందించి రోడ్డు బాగు చేయుటకు పది ట్రాక్టర్ల మొరం పోయించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని గౌరవ సర్పంచి గారికి మరియు వార్డ్ మెంబర్ లింబాద్రి గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు ఇందులో పాల్గొన్న దండబోయిన సిద్ధిరాములు, బోదాసు పెద్ద రాజయ్య, నామాల శ్రీకాంత్, లక్కాకుల రవి, తూర్పు గంగ ప్రసాద్, దేవ రవి, బొంపల్లి నరేష్, కొట్టలపల్లి స్వామి తోట రాములు, బోదాసు నర్సింలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## నేలకొండపల్లి మండలంలో మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ల శనివారం పర్యటన ను విజయవంతం చేయాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు కోరారు. శుక్రవారం అనంతనగర్ విద్యుత్ సబేస్టేషన్ వద్ద పనులను పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులతో ఏర్పాట్లు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. మండలం లోని అనంతనగర్‌లో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబేస్టేషన్ ను మంత్రులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అజయ్ తండా పంచాయతీ కార్యాలయం భవనం ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మోటాపురంలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారని,సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆజయ్ తండా పంచాయతీ కార్యాలయం భవనం ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మోటాపురంలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. కావునా మంత్రుల పర్యటన ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, తిగుళ్ల భవాని, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి వెంకటమ్మ, కొత్తపల్లి వీరమ్మ, మేకల ఆర్జున్, కొమ్మినేని విజయ్ బాబు, ఆనం వెంకటరెడ్డి, తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## పొద్దుటూరులో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ కార్యక్రమం

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** రంగారెడ్డి జిల్లాలో పశుపోషకుల సంక్షేమే లక్ష్యంగా ఈ నెల 25 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న మేకలు, గొర్రెల నట్టల నివారణ కార్యక్రమం శంకర్ పల్లి మండలంలోని పొద్దుటూరు గ్రామంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా లైవ్ స్టాక్ అసిస్టెంట్ వాహీద్ ఆధ్వర్యంలో గ్రామంలో మొత్తం 250 గొర్రెలకు, 200 మేకలకు నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేసి, పశువులకు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నరసింహ, ఉపసర్పంచ్ కావేరి గోవర్ధన్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ....మేకలు, గొర్రెలలో నట్టల సమస్య వల్ల బరువు తగ్గడం, వ్యాధులు రావడం, ఆర్థిక నష్టం కలగడం జరుగుతుందని తెలిపారు. అలాంటి సమస్యలను నివారించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. లైవ్ స్టాక్ అసిస్టెంట్ వాహీద్ మాట్లాడుతూ.... నట్టల నివారణ మందుల వల్ల పశువుల ఆరోగ్యం మెరుగుపడి ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పశుపోషక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు.



## క్రీడా దుస్తులను పంపిణీ చేసిన బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్

**ఆత్మకూర్(ఎం), రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) పట్టణంలో మోడ్రన్ కబడ్డీ జిల్లా జట్టుకు స్థానిక సర్పంచ్ బిసు ధనలక్ష్మి చందర్ గౌడ్ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోడ్రన్ కబడ్డీ జిల్లా అధ్యక్షులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు,మాజీ ఎంపీటీసీ యాస కవితఇంద్రారెడ్డి,ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్,నేతాజీ యువజన మండలి అధ్యక్షులు దొంతరబోయిన మురళీకృష్ణ పాల్గొన్నారు. వార్డు సభ్యులు గడ్డం సతీష్, ఎండి అజీముద్దీన్, మజ్జిగ రాంబాబు, పిఈటి ఉప్పలయ్య, నాతి రాము, బూడిద సాయి హాజరయ్యారు.



## పాక్‌కు మరిన్ని కష్టాలు..

### వైమానిక దళం ఏర్పాటుకు ఉగ్రసంస్థ ప్రణాళిక..

**న్యూఢిల్లీ :** అఫ్గానిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) రెచ్చిపోతోంది. కొత్త ఏడాదిలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేసింది. ఇందులో భాగంగానే పాక్ సైన్యానికి పోటీగా వైమానిక దళం ఏర్పాటు చేయడానికి సిద్ధపడింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు చేసింది. ఈ వార్త పాక్ అధికారులను భయపెడుతోంది. 2026లో ఈ వైమానిక దళం ఏర్పాటు చేస్తా మని టీటీపీ ఓ ప్రకటనలో పేర్కొంది. సలీం హక్కానీ నాయకత్వంలో దీన్ని నడపనున్నట్లు తెలిపింది. దీంతో పాటు ప్రావిన్స్‌ల వారీగా మోహరింపులు, మిలిటరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మిలిటరీ కమాండర్లలతో కూడిన రెండు కొత్త పర్యవేక్షణ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. కశ్మీర్, గిల్గిత్– బాల్టిస్థాన్‌తో సహా మరికొన్ని ప్రావిన్స్‌లను తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్లాన్ చేస్తోంది. మిలిటరీ యూనిట్లలో నాయకత్వ మార్పులు కూడా చేపట్టింది. 2022 నవంబరులో పాక్ ప్రభుత్వంతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని టీటీపీ ముగించింది. ఆ తర్వాత నుంచి పాక్ భద్రతా దళాలు, పోలీసులు, అధికారులపై టీటీపీ వరుస దాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలోచిస్థాన్ ప్రావిన్స్‌లలో కార్యకలాపాలు విస్తరించింది. అఫ్గానిస్థాన్ భూభాగం నుంచి టీటీపీ ఉగ్రదాడులకు పాల్పడుతుందని పాక్ అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే, తాలిబన్ ప్రభుత్వం వీటిని ఖండిస్తోంది.



## వచ్చే ఐదేళ్లలో మరిన్ని క్షిపణులు తయారీ

### ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్

**ఉత్తరకొరియా :** ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన ఆయుధ సంపత్తిని మరింత పెంచుకోవాలని భావిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో మరిన్ని క్షిపణి వ్యవస్థలను రూపొందించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం సంబంధిత అధికారులకు కిమ్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గత కొంతకాలంగా తమ ఆయుధ కర్మాగారాలను వరుసగా సందర్శిస్తూ ఆయుధ సంపత్తి వివరాలను ఆరా తీస్తోన్న కిమ్.. క్షిపణుల తయారీని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించుకున్నట్లు ఉత్తరకొరియా మీడియా కథనం వెల్లడించింది. తమ దేశ సాయుధ దళాల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచాల్సిన అవసరం ఉందని కిమ్ పేర్కొన్నట్లు ఆ కథనం తెలిపింది. ఇందుకోసం కొత్త ఆయుధ కర్మాగారాల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. ఇటీవలి కాలంలో ఉత్తరకొరియా తమ అణుశక్తి పరీక్షలను గణనీయంగా పెంచింది. ఈ సందర్భంగా సముద్రం అడుగు నుంచి ప్రయోగించే రహస్య ఆయుధాల గురించి కిమ్ సమీక్ష జరిపారు. అణు శక్తితో నడిచే జలాంతర్గామిని కిమ్ గురువారం తన కుమార్తెతో కలిసి పరిశీలించారు. 8,700 టన్నుల బరువుండే ఈ భారీ అణు జలాంతర్గామి బాహ్య నిర్మాణం దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది.




## పాక్ సంస్థతో సంబంధాలు..

### మతబోధకుడిపై మనీలాండరింగ్ కేసు..

**న్యూఢిల్లీ :** ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మతబోధకుడు శంసుల్ హుదా ఖాన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. పాకిస్థాన్‌కు చెందిన ఓ సంస్థతో సహా తీవ్రవాద ముఠాలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం శంసుల్ యూకేలో నివాసం ఉన్నట్లు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఓ మదర్సాలో శంసుల్ 1984లో సహాయ ఉపాధ్యాయుడిగా నియమితులయ్యాడు. 2013లో అతడికి బ్రిటిష్ పౌరసత్వం లభించింది. దీంతో విదేశానికి వెళ్లిన అతడు.. మదర్సాలో ఎలాంటి బోధనా విధులు నిర్వర్తించకపోయినా 2013–17 మధ్య జీతం తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత 20ఏళ్లలో అనేక విదేశాల్లో పర్యటించిన శంసుల్.. భారత్‌లోని పలు బ్యాంకుల్లో ఖాతాలు కొనసాగించాడని, వాటిని ఉపయోగించే నిధులు అందుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తీవ్రవాద భావజాలాన్ని ప్రోత్సహించడంతో పాటు.. మత బోధకుడి ముసుగులో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలూ ఉన్నాయి. అతడు దాదాపు రూ.30 కోట్ల విలువైన స్థిరాస్తులను కూడబెట్టినట్లు గుర్తించారు. నిందితుడు తన వ్యక్తిగత ఖాతాలతో పాటు ఓ ఎన్జీవో నుంచి అనేక మదర్సాలకు నిధులు మళ్లించినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఆజంగఢ్, సంత్ కబీర్ నగర్‌లో రెండు మదర్సాలు స్థాపించాడని కనుగొన్నారు. యూకేలోని తీవ్రవాద సంస్థలతో అతడికి ఉన్న సంబంధాలపై దర్యాప్తు జరుపుతున్నామని ఈడీ అధికారులు తెలిపారు. శంసుల్ పాకిస్థాన్‌ను సందర్శించాడని.. అక్కడి 'దావత్ ఏ ఇస్లామీ' సంస్థలో సభ్యుడిగా ఉన్నాడని అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

## ఎయిర్ ప్యూరిఫైయర్లపై

# జీఎస్టీ తగ్గింపు అంశం

### కేంద్రానికి 10 రోజుల గడువు : ఢిల్లీ హైకోర్టు




**న్యూఢిల్లీ :** ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గించే అంశంపై వివరణాత్మక స్పందన తెలియజేసేందుకు కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు 10 రోజుల గడువు విధించింది. దేశ రాజధానిలో గాలి నాణ్యత క్షీణిస్తున్నందున ఎయిర్ ప్యూరిఫైయర్లను వైద్య పరికరంగా పరిగణించి.. వాటిని 5శాతం జీఎస్టీ శ్లాబులోకి తీసుకొచ్చేలా ఆదేశాలివ్వాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన సంగతి తెలిసిందే. దీనిపై నేడు మరోసారి విచారణ జరిపిన న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి ఈ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. నేటి విచారణ సందర్భంగా కేంద్రం తీరుపై న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఎయిర్ ప్యూరిఫైయర్ల ధర రూ.10–15వేలు ఉందని.. సామాన్యులు అంత డబ్బు పెట్టి ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడంలో జీఎస్టీ మండలికి ఇబ్బందేంటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం కేంద్రం తరఫు న్యాయవాది వాదిస్తూ.. పిటిషనర్ తన వ్యాజ్యంలో ఆరోగ్య మంత్రిత్వ శాఖను ప్రస్తావించకపోవడాన్ని తప్పుబట్టారు. ఈ పిటిషన్ ద్వారా ఎవరికి ప్రయోజనం చేకూర్చాలనుకుంటున్నారో తెలియట్లేదని.. పిటిషన్ ఉద్దేశం గురించి తెలుసుకోవడానికి అనేక విషయాలపై దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అంతేగాక, జీఎస్టీ తగ్గింపు అంశంపై చర్చించాలంటే జీఎస్టీ కౌన్సిల్ వ్యక్తిగతంగా సమావేశమవ్వాలని.. వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేయడం సాధ్యం కాదని కేంద్రం తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. దీనిపై స్పందించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో న్యాయస్థానం కేంద్రానికి పది రోజుల సమయం ఇచ్చింది.

## నైజీరియాలో ఐసిస్ లక్ష్యంగా

# అమెరికా భీకర దాడులు..

**నైజీరియా:** నైజీరియాలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులే లక్ష్యంగా అమెరికా భారీగా దాడులు ప్రారంభించింది. ఆ దేశంలోని క్రైస్తవులపై జరుగుతున్న హింసను అరికట్టడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. "నైజీరియాలో ఐసిస్ ఉగ్రవాదులపై యూఎస్ శక్తిమంతమైన దాడులు ప్రారంభించింది. ప్రధానంగా అమాయకులైన క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దారుణంగా చంపుతున్నవారిపై ఇవి జరిగాయి. ఈ ఊచకోతలు ఆపకపోతే నరకం చూపిస్తానని గతంలోనే హెచ్చరించా. నా హెచ్చరికలను వారు పట్టించుకోలేదు. ఇప్పుడు అనుభవిస్తున్నారు. రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని సహించను" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చనిపోయిన ఉగ్రవాదులతో సహా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ హత్యాకాండ కొనసాగితే.. తమ దాడులు కూడా జరుగుతూనే ఉంటాయని హెచ్చరించారు. నైజీరియా అధికారుల అభ్యర్థన మేరకు దాడులు చేసి.. పలువురు ఉగ్రవాదులను అంతం చేశామని అమెరికాకు చెందిన సైన్యాధికారి పేర్కొన్నారు. నైజీరియా ఐసిస్ అనుబంధ వర్గాలు, బోకో హరామ్ అనే తీవ్రవాద సమూహం నుంచి చాలా కాలంగా అభద్రతను ఎదుర్కొంటోంది. 2020లో అమెరికా తొలిసారిగా నైజీరియాను ప్రత్యేక ఆందోళనకర దేశాల జాబితాలో పేర్కొంది. క్రైస్తవులపై జరుగుతున్న హింసను అరికట్టడానికి నైజీరియాలో సైనిక చర్యలకు ప్రణాళిక రూపొందించాలని పెంటగాన్‌ను ఆదేశించినట్లు నవంబరులో ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో తాజాగా దాడులు జరిగాయి.

# కాలిఫోర్నియాలో లైసెన్స్‌లు రద్దు..

### కోర్టులో సవాల్ చేసిన భారతీయ డ్రైవర్లు




**కాలిఫోర్నియా :** ప్రవాస డ్రైవర్లకు ఇచ్చిన వేలాది లైసెన్స్‌లను అమెరికాలోని కాలిఫోర్నియా ప్రభుత్వం రద్దు చేయడాన్ని భారతీయ డ్రైవర్లు అక్కడి కోర్టులో సవాల్ చేశారు. ప్రభుత్వ చర్య తమ జీవనాధారాన్ని ప్రమాదంలో పడేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్స్ గడువు తేదీల్లో సమస్యలున్నట్లు గుర్తించిన కాలిఫోర్నియా రవాణా ఏజెన్సీ.. ప్రవాస డ్రైవర్లకు జారీ చేసిన లైసెన్స్‌లను రద్దు చేయాలని ఇటీవల నిర్ణయించింది. దీంతో దాదాపు 20వేల మంది కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌లపై ఈ ప్రభావం పడింది. గతనెల 17,000 మంది డ్రైవర్లకు 60 రోజుల పాటు లైసెన్స్‌ను రద్దు చేస్తూ నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత నిర్వహించిన సమీక్షల్లో ఈ సంఖ్య మరింత పెరిగింది. అయితే, రవాణా ఏజెన్సీ తప్పులే లైసెన్సుల రద్దుకు కారణమని పౌర హక్కుల సంఘాలు ఆరోపించాయి. వీటిని సరిదిద్ది, లైసెన్స్‌లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో లైసెన్సుల రద్దు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ట్రక్కు డ్రైవర్లు కోర్టు ఆశ్రయించాయి. దీనిపై స్పందించేందుకు రవాణా ఏజెన్సీ నిరాకరించింది. అయితే, ఫెడరల్ అభ్యంతరాలు తొలగిపోతే లైసెన్స్‌లు పునరుద్ధించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గతంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

## పాక్ అణ్వాయుధాలు

# కలవరపెడుతున్నాయి

### అమెరికా వద్ద పుతిన్ ఆందోళన



**రష్యా :** పాకిస్థాన్ అణ్వాయుధాల విస్తరణ గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఓసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశం అణ్వాయుధాల కలిగిన ఒక సైనిక కూటమని అమెరికా వద్ద ప్రస్తావించారు. రెండు దశాబ్దాల క్రితం పుతిన్– అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ మధ్య జరిగిన సంభాషణ తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన నేషనల్ సెక్యూరిటీ ఆర్కైవ్స్ 2001–2008 నాటి వివరాలను బహిర్గతం చేసింది. పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని అణు కార్యక్రమాన్ని నాడు వారిద్దరు తీవ్ర సమస్యగా పరిగణించినట్లు ఆ పత్రాలను బట్టి స్పష్టమవుతోంది. 2001లో స్లోవేనియాలో జరిగిన ఓ సమావేశానికి పుతిన్, నాటి అమెరికా అధ్యక్షుడు బుష్ హాజరయ్యారు. ఈ క్రమంలోనే పాక్ అణ్వాయుధాల అంశంపై వీరు చర్చించారు. అణు కార్యక్రమాల నిబంధనలను ఉల్లంఘించిట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దేశాల విషయంలో వ్యవహరించినట్లుగా.. పాకిస్థాన్‌పై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని నాడు పుతిన్ ప్రశ్నించారు. "అది అణ్వాయుధాలు కలిగిన సైనిక కూటమి. అక్కడ ప్రజాస్వామ్యం లేదు. మిలిటరీ పాలనలో ఉంది. కానీ పశ్చిమ దేశాలు దానిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదు. దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉంది" అని రష్యా అధ్యక్షుడు ఆక్షేపించారు. పాక్ పట్ల ఉదాసీనంగా వ్యవహరించడంపై పలు అనుమానాలు లేవనెత్తారు. ఈ వ్యాఖ్యలతో బుష్ విభేదించలేదు. పాక్ అక్రమ అణు వ్యాపారంపై అమెరికా అధ్యక్షుడు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఇరాన్ అణు కార్యక్రమంలో పాక్ యురేనియాన్ని గుర్తించామని 2005లో జరిగిన మరో భేటీలో బుష్ వద్ద పుతిన్ ప్రస్తావించారు. పాక్ అక్రమ వ్యాపారాన్ని ఇది వెల్లడిచేసింది. ఈ ఉల్లంఘన కలవరపెట్టేదే అని పుతిన్ మాటలను బుష్ అంగీకరించారు. నియంత్రణ వ్యవస్థలను దాటి ఈ ప్రమాదకర పదార్థం చేతులు మారడం గురించి వారు మాట్లాడుకున్నారు. పాక్ అణుపితామహుడు అబ్దుల్ ఖాదిర్ ఖాన్ కార్యకలాపాలు బయటపడిన తర్వాత ఆ దేశంపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చామని నాడు బుష్ వెల్లడించారు. అలాగే ఖాన్‌తో పాటు అతడి అనుచరులను నిర్బంధించేలా చేశామన్నారు. కానీ.. ఈ అణు పదార్థాలు పాక్ నుంచి ఎవరికి చేరాయనే దానిపై మాత్రం స్పష్టత లేదని ఆ సందర్భంలో బుష్ తెలిపారు. ప్రజాస్వామ్య జవాబుదారీతనం లేని ప్రభుత్వాల చేతుల్లో అణ్వాయుధాలు అధికంగా ఉన్నాయని పుతిన్ పదేపదే లేవనెత్తగా.. ఆ సున్నితమైన పరిజ్ఞానం మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించాల్సిన అవసరం ఉందని బుష్ సమర్థించినట్లు తాజాగా బయటపడిన పత్రాల్లో వెల్లడైంది. పాక్ అణ్వాయుధాలపై భారత్ కొన్నేళ్లుగా ఇదే తరహా ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఇదే విషయం రష్యా అధ్యక్షుడి మాటల్లోనూ దశాబ్దాల క్రితమే ప్రతిబింబించడం గమనార్హం.



## ఢిల్లీ వాయు కాలుష్యం..

### వారు పరిష్కరించగలరని నమ్ముతున్నా : జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ :** దిల్లీలో రోజురోజుకు తీవ్రమవుతోన్న వాయు కాలుష్యంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశరాజధానిని పీడిస్తున్న ఈ సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ప్రయోజనాలు కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారం కనుగొంటారని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. గోవాలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన జస్టిస్ సూర్యకాంత్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ రాజధానిలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. శుక్రవారం ఉదయం హానికర పొగమంచు దిల్లీలోని అనేక ప్రాంతాలను కమ్మేసింది. ఫలితంగా దృశ్య నాణ్యత బాగా పడిపోయింది. దీంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్–4 కింద ఆంక్షల అమలును కొనసాగిస్తున్నారు. దిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ 310గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఏక్యూఐ స్థాయిలు 395గా నమోదైనట్లు తెలిపింది.



## బంగ్లాదేశ్ వాసులుగా భావించి..

# బెంగాలీ కూలీలపై దాడి

**ఒడిశా :** బంగ్లాదేశ్ వాసులుగా భావించి.. బెంగాలీ కూలీలపై దాడి చేయడంతో ఓ కూలీ మరణించిన ఘటన ఒడిశాలో చోటు చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని సంబల్పూర్ జిల్లాలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆరుగురు వలస కార్మికులు పనుల కోసం వెళ్తుండగా కొంతమంది వారిని అడ్డుకున్నారు. కూలీలను బంగ్లాదేశ్ వాసులుగా భావించి వారి ఆధార్ కార్డులను చూపించాలని బెదిరించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో కూలీలపై నిందితులు పదునైన వస్తువులతో దాడి చేశారు. ఈ ఘటనలో ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోగా.. మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కూలీలపై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులను గుర్తించి, అరెస్టు చేసినట్లు వెల్లడించారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ ఘటనను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. బెంగాలీలను చొరబాటుదారులుగా పేర్కొంటూ.. భాజపా నేతలు చేస్తున్న ప్రచారాల వల్లే ఇటువంటి దాడులు జరుగుతున్నాయని ఆరోపించింది.



## ఉదయ్‌పూర్‌లో గ్యాంగ్ రేప్..

### కంపెనీ సీఈవోతో సహా ముగ్గురి అరెస్ట్

**రాజస్థాన్ :** రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో ఒక ప్రైవేట్ ఐటీ కంపెనీ మహిళా మేనేజర్‌పై సామూహిక అత్యాచారం కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితుడైన కంపెనీ సీఈవో జితేశ్ సిసోదియా సహా ముగ్గురిని అరెస్టు చేసి, కోర్టు ముందు హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల్లో కంపెనీ మహిళా ఎగ్జిక్యూటివ్ హెడ్, ఆమె భర్త కూడా ఉన్నట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు కారు డ్యాష్‌కామ్‌లో రికార్డు అయినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఘటన సమయంలో నిందితులు మద్యం మత్తులో ఉన్నారన్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లోని ఓ ఐటీ కంపెనీ సీఈవో అయిన జితేశ్ ఇటీవల తన పుట్టినరోజు సందర్భంగా తన సంస్థలో పనిచేసే వారికి పార్టీ ఇచ్చారు. ఈ పార్టీ ముగించుకుని మహిళా మేనేజర్ ఇంటికి వెళుతుండగా.. కంపెనీలో పనిచేస్తున్న మహిళా ఎగ్జిక్యూటివ్ హెడ్ లిఫ్ట్ ఇస్తానని ఆఫర్ చేశారు. ఇదే కారులో ఎగ్జిక్యూటివ్ హెడ్ భర్తతో పాటు సీఈవో జితేశ్ కూడా ఉన్నారు. మార్గమధ్యంలో వారు ఓ దుకాణంలో సిగరెట్ లాంటి పదార్థాన్ని మేనేజర్‌కు ఇచ్చారు. దాన్ని తాగిన అనంతరం తాను స్పృహ కోల్పోయానని, దీంతో సీఈవో, ఎగ్జిక్యూటివ్ హెడ్ భర్త తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. కాసేపటి తర్వాత మెలకువ వచ్చి తనను ఇంటివద్ద దించాలని వేడుకున్నా.. మరుసటి రోజు ఉదయం వరకు కారులోనే తిప్పారని తెలిపింది. మహిళా మేనేజర్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేశారు.

# కంపెనీ అమ్మేసి..
## ఉద్యోగులకు రూ.2వేల కోట్ల బోనస్



క్రిస్మస్ వేళ తన ఉద్యోగులకు ఓ సీఈఓ భారీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. రూ.2000కోట్ల బోనస్‌ను కేటాయించారు. 540 మంది ఉద్యోగులకు ఈ మొత్తం అందేలా చూశారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. అమెరికాలోని లూసియానా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోన్న ఫైబర్‌బాండ్ సంస్థకు గ్రాహమ్ వాకర్ సీఈఓగా వ్యవహరిస్తున్నారు. తన తండ్రి స్థాపించిన ఈ నిర్మాణ రంగ కంపెనీని 1.7 బిలియన్ డాలర్లకు ఇటీవల విక్రయించారు. ఈ విక్రయానికి ముందే కొనుగోలుదారైన ఈటన్ సంస్థకు ఒక కండీషన్ పెట్టారు. 15 శాతం వాటా (సుమారు రూ.2వేల కోట్లు)ను కొన్నేళ్లుగా ఈ సంస్థలోనే కొనసాగుతోన్న 540 మంది ఉద్యోగులకు కేటాయించాలని స్పష్టంగా చెప్పారు. అందుకు ఈటన్ అంగీకరించడంతో రానున్న ఐదేళ్ల కాలంలో ఆ సిబ్బంది ఒక్కొక్కరికీ రూ.4 కోట్ల మేర అందనుంది. ఇప్పటికే అది వారి ఖాతాల్లో జమ కావడం ప్రారంభమైంది. ఆ ఉద్యోగులు కొత్త యాజమాన్యం కింద దీర్ఘకాలం ఉద్యోగంలో కొనసాగితే... వారికి అందే మొత్తం ఇంకా పెరగనుంది. తొలుత ఈ వార్తను ఎవరూ నమ్మలేదు. "ఇదంతా ఆశ్చర్యంగా అనిపించింది. ఇది మాకు లాటరీనే" అని బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోన్న హెక్టర్ మెరెనో పేర్కొన్నారు. 1995 నుంచి ఆ సంస్థలో పనిచేస్తోన్న లేసియాకీ.. తమకు కేటాయించిన మొత్తం గురించి తెలుసుకొని ఉద్వేగానికి గురయ్యారు. ఈ డబ్బుతో తన అప్పులు తీర్చుకుంటానని చెప్పారు. ఇలా ఉద్యోగులు ఒక్కోలా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గ్రాహమ్ తండ్రి క్లాడ్ వాకర్ ఈ ఫైబర్‌బాండ్ సంస్థను 1982లో స్థాపించారు. డిసెంబర్ 31న సీఈఓ పదవి నుంచి గ్రాహమ్ దిగిపోనున్నారు. ప్రస్తుతం ఈ బోనస్ వార్త నెట్టింట్లో వైరల్ అవుతోంది. "ఇది మంచి క్రిస్మస్ స్టోరీ. ఇలాంటి పెట్టుబడిదారీ విధానం మనకు చాలా అవసరం. ఈ బాస్ తన ఉద్యోగుల్ని కుటుంబంలా భావించారు" అని నెటిజన్లు స్పందిస్తున్నారు.






## నష్టాలతో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలకు తోడు, సూచీలను ముందుకు నడిపించే అంశాలేవీ లేకపోవడం విక్రయాలు కొనసాగాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఏడాది చివర కావడంతో ట్రేడింగ్ యాక్టివిటీ అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలోనే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.1 లక్ష కోట్లు క్షీణించి రూ.474 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 85,225.28 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,408.70) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,937.82 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 367.25 పాయింట్ల నష్టంతో 85,041.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99.80 పాయింట్ల వద్ద 26,042.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఎటెర్నల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టైటాన్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.31 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,517 డాలర్ల ట్రేడవుతోంది.



# రింకు సింగ్ అజేయ సెంచరీ..
## విరాట్, పంత్ అర్ధశతకాలు

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా రాజ్‌కోట్ వేదికగా ఉత్తరప్రదేశ్, చండీగఢ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చండీగఢ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్.. నిర్ణీత 50 ఓవర్లకు 4 వికెట్లు నష్టపోయి 367 పరుగులు చేసింది. ఆర్యన్ జుయల్ (134, 118 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు), రింకు సింగ్ (106, 60 బంతుల్లో, 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగిపోయారు. ధ్రువ్ జురెల్ హాఫ్ సెంచరీ (67, 57 బంతుల్లో, 11 ఫోర్లు) సాధించాడు. చండీగఢ్ బౌలర్లలో తరణ్‌ప్రీత్ సింగ్ 2, నిశుంక్ బిర్లా, సందీప్ శర్మ తలో వికెట్ తీసుకున్నారు. జైపుర్ వేదికగా ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో ఆ జట్టు 7 వికెట్ల నష్టానికి 331 పరుగులు సాధించింది. గత మ్యాచ్‌లో సెంచరీతో ఆకట్టుకున్న రోహిత్ శర్మ ఇన్నింగ్స్ తొలి బంతికే డకౌట్‌గా వెనుదిరిగాడు. హార్దిక్ తామోర్ (93) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ (55), అతడి సోదరుడు ముషీర్ ఖాన్ (55) అర్ధశతకాలు చేశారు. బెంగళూరు వేదికగా గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ మొదట బ్యాటింగ్ చేసింది. 50 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 254 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (77, 61 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్), రిషభ్ పంత్ (70, 79 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో రాణించారు.



# ఒక్క రోజే 20 వికెట్లు డౌన్
## 110 పరుగులకే కుప్పకూలిన ఇంగ్లాండ్..

**మెల్‌బోర్న్ :** యాషెస్ సిరీస్‌లో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ తన తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 29.5 ఓవర్లలోనే 110 పరుగులకు కుప్పకూలింది. 42 పరుగుల వెనకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ (41, 34 బంతుల్లో, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. గస్ అట్కిన్సన్ (28 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. జో రూట్ (0), బెన్‌స్టోక్స్ (16), జెమ్మీ స్మిత్ సహా మిగతా వారంతా వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నెసర్ 4, స్కాట్ బోల్యాండ్ 3, మిచెల్ స్టార్క్ 2, కామెరూన్ గ్రీన్ ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్.. తొలి రోజు ఆటముగిసే సమయానికి ఒక ఓవర్‌కు వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (0), స్కాట్ బోల్యాండ్ (4) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం ఆ జట్టు 46 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లో ఒక్క రోజులోనే 20 వికెట్లు పడటం గమనార్హం. ఇరు జట్లలో ఏ ఒక్క బ్యాటర్ కూడా కనీసం హాఫ్ సెంచరీ చేయలేకపోయాడు.

## 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను
# అందుకున్న వైభవ్ సూర్యవంశీ



టీనేజ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరో ఘనత సాధించాడు. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డును అందుకున్నాడు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారం తీసుకున్నాడు. చిన్న వయసులోనే క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందుకు గానూ వైభవ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్ తన మొదటి మ్యాచ్ ఆడాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అతి పిన్న వయసులో (14 ఏళ్ల 23 రోజులు) అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచాడు. అలాగే తాను ఆడిన మూడో మ్యాచ్‌లోనే గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లోనే సెంచరీ సాధించి సంచలనం సృష్టించాడు. తర్వాత ఆసియా కప్ రైజింగ్ స్టార్స్, అండర్ -19 ఆసియా కప్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీల్లోనూ సెంచరీలు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అతి పిన్న వయసులో శతకం (14 ఏళ్ల 250 రోజులు) బాదిన క్రికెటర్‌గా రికార్డ్ సృష్టించాడు. తాజాగా విజయ్ హజారే ట్రోఫీలోనూ బుధవారం అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో బిహార్ తరఫున వైభవ్ సూర్యవంశీ కేవలం 36 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చిన అతడు (190, 84 బంతుల్లోబీ 16 ఫోర్లు, 15 సిక్స్‌లు) కాస్తలో డబుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు.

# కళతప్పిన యాషెస్ సిరీస్?
## పోటీ లేదు.. మజానిచ్చే ఆటగాళ్లు కరవు

**యాషెస్ సిరీస్ గురించి విశిష్ఠత గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. వన్డేల్లో ప్రపంచకప్ మొదలై 40 ఏళ్లు కాగా.. టీ20ల్లో 18 ఏళ్ల ముందు నుంచే ప్రపంచకప్ చూస్తున్నాం. టెస్టుల్లో నాలుగేళ్ల ముందే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ మొదలైంది. కానీ యాషెస్ సిరీస్‌కు ఏకంగా 140 ఏళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర ఉంది. వన్డే ప్రపంచకప్ రావడానికి ముందు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లకు అది ప్రపంచకప్ లాంటి ట్రోఫీనే. వివిధ ఫార్మాట్లలో ఎన్ని బహుళ దేశాల టోర్నీ లు వచ్చినా.. యాషెస్ మాత్రం ఆ రెండు జట్లకూ ఎంతో ప్ర త్యేకమే. ఐతే రసవత్తర పోరాటాలకు పెట్టింది పేరుగా ఉన్న యాషెస్ క్రమంగా ప్రాభవం కోల్పోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుత పోరు అత్యంత పేలవమైన యాషెస్ సిరీస్‌ల్లో ఒకటిగా నిలిచే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇంత చప్పగా బూడిద సమరం ఎప్పుడూ లేదన్నది క్రికెట్ అభిమానుల మాట.**



యాషెస్‌లో మొత్తంగా ఆస్ట్రేలియాదే పైచేయి అయినప్పటికీ.. ఇంగ్లాండ్ తక్కువేమీ కాదు. 1882-83లో మొదలైన తొలి పోరుతో ఆరంభిస్తే.. ప్రస్తుత సిరీస్ ముందు వరకు జరిగిన యాషెస్ సమరాలు 73. అందులో 34 సార్లు ఆస్ట్రేలియా గెలిస్తే.. 32 సార్లు ఇంగ్లాండ్ విజేతగా నిలిచింది. మిగతా సిరీస్‌లు డ్రా అయ్యాయి. దీన్ని బట్టే యాషెస్ ఎంత హోరాహోరీగా సాగుతూ వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఆస్ట్రేలియాతో పోలిస్తే ఇంగ్లాండ్ బలహీన పడ్డ సందర్భాల్లో కూడా యాషెస్‌కు వచ్చేసరికి మెరుగైన ప్రదర్శనే చేసేది. 2009-2015 మధ్య అయిదు యాషెస్ సిరీస్‌ల్లో నాలుగు ఇంగ్లాండే గెలవడం విశేషం. కానీ ఆ తర్వాత మాత్రం ఆ జట్టు ఒక్కసారీ సిరీస్ సాధించలేకపోయింది. అయిదు సిరీస్‌ల్లో మూడుసార్లు ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. మిగతా రెండుసార్లు సిరీస్ డ్రా కావడంతో యాషెస్ ఆసీస్ వద్దే ఉంది. ప్రస్తుత యాషెస్ మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే ఆస్ట్రేలియా సొంతమైంది. ఇంగ్లాండ్ ఓడటం కంటే ఓడిన తీరు.. ఈ సిరీస్ సాగుతున్న వైనం యాషెస్ ప్రియులను నిరాశకు గురిచేస్తోంది.

### మజా ఎందుకు లేదంటే?

చివరగా ఇంగ్లాండ్ ఆతిథ్యమిచ్చిన యాషెస్ సిరీస్ రసవత్తరంగా సాగింది. 2023లో ఆ సిరీస్ జరిగే సమయానికి ఇంగ్లాండ్ దూకుడుగా సాగే బాజ్‌బాల్ శైలితో ప్రపంచ క్రికెట్‌ను ఊపేస్తూ ఉంది. ఈ సిరీస్‌లోనూ తన మార్కు ఆటతో ఇంగ్లాండ్ ఆకట్టుకుంది. కానీ తొలి టెస్టులో గెలిచే అవకాశమున్న మ్యాచ్‌లో ఆ జట్టు తొందరపడి చేసిన డిక్లరేషన్ వల్ల దెబ్బ తిని ఓటమి మూటగట్టుకుంది. లేదంటే సిరీస్ ఇంగ్లాండ్ సొంతమయ్యేది. మొత్తంగా ఆ సిరీస్‌లో ఇంగ్లాండ్‌దే పైచేయి. కానీ గత ఏడాది నుంచి ఇంగ్లాండ్ ప్రదర్శన పడిపోతూ వచ్చింది. బాజ్‌బాల్ ఆట పనిచేయక పాకిస్థాన్ పర్యటనలో ఓటమి ఎదురైంది. ఈ ఏడాది సొంతగడ్డపై భారత్‌తో సిరీస్ 2-2తో డ్రాగా ముగియడం ఇంగ్లాండ్‌కు షాక్.
అప్పుడే యాషెస్‌లో ఆ జట్టుకు ఓటమి తప్పదని విశ్లేషకులు అంచనా కట్టారు. ఆ అంచనాకు తగ్గట్లే సిరీస్ సాగింది. తొలి టెస్టు హోరాహోరీగానే ఆరంభమైనప్పటికీ.. నాలుగో ఇన్నింగ్స్‌లో ట్రావిస్ హెడ్ విధ్వంసం ఇంగ్లిష్ జట్టును కుదేలు చేసింది. ఆ ఓటమితో ఇంగ్లాండ్ ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. తర్వాతి రెండు మ్యాచుల్లోనూ ఓటములు ఎదురయ్యాయి. ఇంకో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్ ఆస్ట్రేలియా సొంతమైంది. ఇంగ్లాండ్ బౌలింగ్ ఒక్కసారిగా బలహీన పడటం.. బ్యాటర్లు అంచనాలకు తగ్గట్లు రాణించకపోవడంతో ఆ జట్టులో పోటీ తత్వం తగ్గిపోయింది. జేమ్స్ అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ ఉన్నంత కాలం ఇంగ్లాండ్ ఆస్ట్రేలియాను దీటుగా ఎదుర్కొనేది. కానీ వారు రిటైరయ్యాక ఇంగ్లిష్ జట్టు పేస్ బలం తగ్గింది. ఈ మధ్యే క్రిస్ వోక్స్ సైతం రిటైరైపోయాడు. మార్క్ వుడ్ గాయంతో తొలి టెస్టు తర్వాత దూరం కావడం ఇంగ్లాండ్‌కు పెద్ద ఎదురుదెబ్బ.
ఆర్చర్, కార్స్, టంగ్ లాంటి బౌలర్లు అంచనాలను అందుకోలేకపోయారు. ఆర్చర్ ఇప్పుడు చివరి రెండు టెస్టులకు దూరం అయిపోయాడు. ఇంగ్లాండ్ జట్టులో నిలకడైన ఒక్క స్పెషలిస్ట్ స్పిన్నరూ లేని పరిస్థితి. బ్యాటింగ్‌లో డకెట్, పోప్, బ్రూక్ ఈ సిరీస్‌లో తీవ్రంగా నిరాశపరిచాడు. స్టోక్స్, క్రాలీ పోరాడుతున్నా ఫలితం ఉండట్లేదు. అవతల ఆస్ట్రేలియా జట్టు కూడా అంత గొప్పగా ఏమీ లేదు. కొందరు కీలక ఆటగాళ్ల గాయాలతో ఆ జట్టూ బలహీన పడింది. హేజిల్‌వుడ్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. కెప్టెన్ కమిన్స్ మూడో టెస్టు ఒక్కటే ఆడాడు. స్టీవ్ స్మిత్ మూడో టెస్టులో బరిలోకి దిగలేదు. లైయన్ సైతం గాయపడ్డాడు. ఓపెనింగ్‌లో వార్నర్ ఉన్నప్పటి ఆకర్షణ ఇప్పుడు లేదు. ఇలా ఏకపక్ష మ్యాచ్‌లకు తోడు ఆకర్షణీయ ఆటగాళ్లు తక్కువగా ఉండడం వల్ల కూడా యాషెస్ కొంత ఆకర్షణ కోల్పోయింది. గతంలో సిరీస్ ఫలితాలు ముందే తేలినా మిగతా మ్యాచ్‌లూ ఆసక్తికరంగా సాగేవి. ఈసారి ఆ పరిస్థితి కనిపించడం లేదు. శుక్రవారం నాలుగో టెస్టు ఆరంభం కాబోతుండగా యాషెస్‌ఈ గురించి పెద్దగా చర్చే లేదు. యాషెస్ మధ్యలో ఉండగా ఇలా అందరూ దానిపై ఆసక్తి కోల్పోవడం ఎప్పుడూ జరగలేదు. ఈ సిరీస్ సంగతి పక్కన పెడితే.. ఇంగ్లాండ్ ప్రస్తుత పతనం చూస్తుంటే సమీప భవిష్యత్తులో ఆ జట్టు కోలుకోవడం కష్టమే అనిపిస్తోంది. మరి ముమ్ముందు యాషెస్ ఎలా ఉండబోతోందో?



# వెండి ధగధగలు..
## రూ.2.37 లక్షలు దాటి పరుగులు

**హైదరాబాద్:** దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. వెండి రికార్డులు కొల్లగొడుతూ పరుగులు పెడుతోంది. హైదరాబాద్‌లో శుక్రవారం కేజీ ధర ఏకంగా రూ.2.37 లక్షలు పలికింది. ఇక 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర ఒక దశలో రూ. 1,42,800 లక్షలకు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,28,350గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఔన్సు బంగారం ధర 4,507 డాలర్లు, వెండి ధర 75 డాలర్లకు చేరింది. ఈ నెల 18 నుంచి వెండి ధర దాదాపు రూ.29 వేలు(14.33 శాతం) పెరగడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటికే పుత్తడి ధర దాదాపు 70శాతం వరకు ఎగబాకింది. 1979 తర్వాత ఇదే అతిపెద్ద వార్షిక లాభమని నిపుణులు చెబుతున్నారు. వచ్చే ఏడాది మరోసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత పెడుతుందన్న అంచనాలతో బంగారం, వెండిని సురక్షిత పెట్టుబడి సాధనాలుగా మదుపర్లు భావిస్తున్నారు. దీంతో ఈ లోహాల ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. 2026 ప్రారంభంలోనూ ఈ లోహాల ధరల పరుగు కొనసాగొచ్చని అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, డాలర్ బలహీనత, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి.




## జీమెయిల్ యూజర్లకు గుడ్‌న్యూస్
### అడ్రస్ మార్చుకునే వీలు

జీ-మెయిల్ వాడేవారికి గుడ్‌న్యూస్. యూజర్లు ఎన్నో రోజులుగా వేచి చూస్తున్న ఆప్షన్‌ను గూగుల్ తీసుకొచ్చింది. జీ-మెయిల్ ఐడీని (యూజర్‌నేమ్) మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. పాత యూజర్ ఐడీని మార్చుకోవాలని కోరుకునే వారికి ఇదొక సదవకాశం. దీనివల్ల చాలా మంది కొత్తగా ఇ-మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకునే అవసరం తప్పుతుంది. అవగాహన లేకనో, పేర్లు అందుబాటులో లేకనో ఏదో ఒక యూజర్ ఐడీతో కొందరు మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకుని ఉంటారు. చాలా సందర్భాల్లో అదే మెయిల్ ఐడీని ఇచ్చేసి ఉంటారు. తర్వాత దాన్ని మార్చుకుందామంటే కుదరదు. దీంతో కొత్తగా ఇ-మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకోవడం తప్ప ఇంకో ఆప్షన్ లేదు. పాత డేటా కోల్పోవడం ఇష్టం లేనివారు దాన్నే వాడుతుంటారు. ఈ నేపథ్యంలో ఇ-మెయిల్ ఐడీని మార్చుకునే వెసులుబాటును గూగుల్ తీసుకొచ్చింది. గూగుల్‌కు సంబంధించిన సపోర్ట్ పేజీలో ఈ ఆప్షన్ దర్శనమిచ్చింది. చివర్లో ఏజీమెయిల్.కామ్ అలానే ఉంటూ అడ్రస్‌ను మార్చుకోవచ్చు. కొత్త ఇ-మెయిల్ ఐడీని ఎంచుకున్నప్పటికీ.. దాన్ని పాత అకౌంట్‌గానే గూగుల్ పరిగణిస్తుంది. అంటే పేరు మాత్రమే మారుతుందన్నమాట. మనిషికి రెండు పేర్లున్నట్లే జీమెయిల్‌కూ ఇకపై రెండు యూజర్‌నేమ్‌లు ఉంటాయన్నమాట. పాత మెయిల్ ఐడీకి వచ్చిన ఫొటోలు, మెసేజులు, ఇ-మెయిల్స్ పోతాయన్న చింత కూడా అక్కర్లేదు. ఒకసారి గూగుల్ ఐడీ మార్చుకున్నాక మళ్లీ ఏడాది వరకు మార్చుకునే వెసులుబాటు ఉండదు. అలానే మొత్తంగా మూడుసార్లు మాత్రమే ఇ-మెయిల్ ఐడీని మార్చుకునే అవకాశం కల్పిస్తోంది. ప్రస్తుతానికి ఈ ఆప్షన్ అందరికీ అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. కొందరికి మాత్రమే ఈ ఆప్షన్ రోలవుట్ చేసినట్లు తెలుస్తోంది. మీ వరకు ఈ ఆప్షన్ రావాలంటే కొన్ని రోజులు ఆగాల్సి ఉంటుంది.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# 2025 టాప్‌లో 'ధురంధర్'

## రూ.1000కోట్ల క్లబ్‌లో చేరిన చిత్రం

రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్' ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోన్న ఈ చిత్రం ఇప్పుడు మరో మైలురాయిని చేరుకొని ఏకంగా రూ.1000 కోట్ల మార్క్‌ను దాటేసింది. అలాగే, 2025లో భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగానూ నిలిచింది. తొలి రోజు నుంచే కలెక్షన్లలో టాప్‌లో కొనసాగుతోన్న 'ధురంధర్' 21వ రోజు రూ.26 కోట్లను సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పటి వరకూ రూ.1006కోట్లు వసూలు చేసింది. 21వ రోజు కూడా ప్రపంచవ్యాప్తంగా 4,753 థియేటర్‌లలో విజయవంతంగా అలరించింది. భారత్‌లో రూ.668 కోట్లు వసూళ్లు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటి వరకూ ఉన్న పలు బ్లాక్‌బస్టర్ చిత్రాల రికార్డులను ఇది అధిగమించింది. స్త్రీ 2 (రూ.598 కోట్లు), ఛావా (రూ.601 కోట్లు)లను బీట్ చేసి టాప్ వన్‌లోకి వచ్చేసింది. దర్శకుడు ఆదిత్య ధర్ కెరీర్‌తో పాటు నటుడు రణ్‌వీర్ సింగ్ కెరీర్‌లోనూ అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. మరోవైపు 'ధురంధర్ 2' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న సీక్వెల్ విడుదల కానుంది. అంతేకాదు, హిందీతో పాటు, దక్షిణాది భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం పార్ట్ 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.



తనకంటూ ప్రత్యేక ఫేమ్ రాబట్టుకున్న యంగ్ బ్యూటీ రుక్మిణి వసంత్ తెలుగు, తమిళ, కన్నడ మలయాల భాషల్లో వరుస చిత్రాలు చేస్తూ హిట్ తన ఖాతాలో వేసుకుంటుంది. ఇటీవల 'కాంతార: చాప్టర్1' మూవీతో వచ్చిన ఈ భామ సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తెలుగులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' మూవీలో నటించనుంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా, రుక్మిణి వసంత్ హీరో యష్ 'టాక్సిక్'లోనూ కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె పలు విషయాలు పంచుకుంది. ప్రస్తుతం

# 'డ్రాగన్' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్

నేను ఎన్టీఆర్ గారి ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్' లో నటిస్తున్నాను. ఈ సినిమా నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా ఉండబోతోందని చెప్పాలి. ఎందుకంటే ఎన్టీఆర్ లాంటి పవర్‌ఫుల్ స్టార్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం నిజంగా గర్వంగా, ఆనందంగా అనిపిస్తుందని చెప్పింది. ఇందులో నా పాత్రకు మంచి ప్రాధాన్యత ఉండబోతుందని, ప్రేక్షకులు తప్పకుండా నన్ను కొత్త కోణంలో చూస్తారని ఆశిస్తున్నానని అంచనాలు పెంచింది. అలాగే తన తదుపరి ప్రాజెక్ట్‌ల గురించి చెప్తూ.. ఇతర సినిమాల గురించి వివరాలు వెల్లడించలేను. ముఖ్యంగా 'టాక్సిక్' మూవీకి సంబంధించిన అప్‌డేట్స్ గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని నాకు తెలుసు. కానీ మేకర్స్ నిర్ణయం ప్రకారం, నేను ఏమీ చెప్పకూడదు. కానీ సరైన సమయం వచ్చినప్పుడు అధికారికంగా అన్ని విషయాలు తెలియజేస్తాం. ఆ వరకు కొంచెం ఓపిక పట్టాలని కోరింది. త్వరలోనే నా రాబోయే సినిమాల గురించి పూర్తి వివరాలతో మీ ముందుకు వస్తాను. మీ ప్రేమ, మద్దతే నాకు అతిపెద్ద బలమని పేర్కొంది.

# దండోరాను ఆదరించండి

## ప్రేక్షకులకు నటుడు శివాజీ వినతి



'దండోరా'ను ఆదరించిన ప్రేక్షకులకు చిత్రబృందం ధన్యవాదాలు తెలిపింది. థియేటర్‌లో ఆడియన్స్ స్పందన చూస్తుంటే గూస్‌బంప్స్ వచ్చాయని దర్శకుడు మురళీకాంత్ అన్నారు. పల్లె కథగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'దండోరా' పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. 'కొన్ని తరాలకు ఒకసారి ఇలాంటి సినిమా వస్తుంది. రెండురోజుల ముందు ప్రీమియర్స్ పడిన్లటైతే కలెక్షన్లు వేరేలా ఉండేవి. సెన్సార్ వల్ల విడుదల ఆలస్యమైంది. 'దండోరా' గురించి 2026 మొత్తం కూడా మాట్లాడుకుంటారు. విదేశాల్లో కూడా మంచి ఆదరణ లభిస్తోంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నన్ని రోజులు నేను నిద్రపోయింది కేవలం రెండు గంటలే. ఎందుకంటే ముఖం ఉబ్బుగా ఉండాలని నిద్ర మానుకున్నాను. సినిమా మొత్తం నిద్రముఖంలానే ఉంటుంది. నా పాత్రకు నేను అలా కనిపించకపోతే డైరెక్టర్ దెబ్బతింటాడు. నిద్రమానుకోమని డైరెక్టర్ నాకు చెప్పలేదు.. కానీ, నేనే అలా చేశా. సినిమా కోసం ప్రతి ఆర్టిస్టూ ప్రాణం పెడతారు. అలా చేసిన సినిమానే 'దండోరా'. దయచేసి నా వ్యక్తిగత విషయాల వైపు వెళ్లకండి. నేను వాటి గురించి విడిగా చూసుకుంటాను. వాటివైపు వెళ్లకుండా ఈ సినిమాను ప్రమోట్ చేయండి. లేదంటే ఆ నింద నేను మోయాల్సి వస్తుంది. ఈ సినిమా గురించి మాత్రమే మాట్లాడండి. కావాలంటే నేను థియేటర్‌కు వస్తాను. ఏం మాట్లాడాలన్నా నేను థియేటర్‌లో మాట్లాడతాను. మంచి సినిమాను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆర్టిస్టుకు ఉంటుంది' అని అన్నారు. నేను మూడేళ్లుగా 'దండోరా' కోసం కష్టపడ్డాను. ఆ శ్రమకు తగిన ఫలితం స్క్రీన్‌పై కనిపించింది. డిసెంబర్ 25న చాలా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. కథపై మాకున్న నమ్మకంతోనే పోటీకి భయపడకుండా విడుదల చేశాం. ఇది మూడున్నరేళ్ల కష్టం. ఈవెంట్‌లలో రెండుమూడు మాటలు దొర్లితే వాటి ఆధారంగా సినిమాను జడ్జ్ చేయకండి' అని దర్శకుడు మురళీకాంత్ కోరారు. థియేటర్‌కు వచ్చి సినిమా చూసి అభిప్రాయాన్ని తెలపాలన్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో మళయాళ మూవీ ఎకో




మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చే థ్రిల్లర్ సినిమాలకు తెలుగు ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్ ఉంటుందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలు సినిమాలు ఓటీటీ వేదికగా వచ్చి అలరించాయి. అయితే గతేడాది 'కిష్కింధ కాండం' సినిమాతో అందరినీ ఆశ్చర్యపరిచిన దర్శకుడు దిన్జిత్ అయ్యతన్ నుంచి వచ్చిన మరో అద్భుత దృశ్యకావ్యం ఎకో. అలపుజా జింఖానా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు సందీప్ ప్రదీప్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించగా.. వినీత్, నరైన్ కీలక పాత్రల్లో మెరిశారు. నవంబర్ 21న థియేటర్లలో విడుదలై విమర్శకుల ప్రశంసలు అందు కున్న ఈ చిత్రం, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. న్యూ ఇయర్ కానుకగా డిసెంబర్ 31 నుంచి ఈ సినిమా మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ మరియు కర్ణాటక సరిహద్దులోని కాట్టుకున్ను అనే అటవీ ప్రాంతం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. అడవిలోని రహస్యాలు, మనుషులు మరియు వన్యప్రాణుల మధ్య ఉండే సున్నితమైన, అంతుచిక్కని బంధం చుట్టూ దర్శకుడు ఈ మిస్టరీని తెరకెక్కించాడు.

# కలెక్షన్లలోనూ ఛాంపియన్




యంగ్ హీరో రోషన్ నటించిన తాజా చిత్రం 'ఛాంపియన్' థియేటర్లలో సూపర్ జోష్‌తో దూసుకెళ్తోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా 25న ప్రేక్షకుల ముందుకు రాగా, ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సాఫీస్ వద్ద 'ఛాంపియన్' కలెక్షన్స్ భారీగా నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా రోషన్ కెరీర్‌లోనే ఈ సినిమాకు బెస్ట్ ఓపెనింగ్స్ రావడం విశేషంగా మారింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం నైజాం ఏరియాలోనే రూ. 2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇక వరల్డ్ వైడ్ ఫస్ట్ డే కలెక్షన్స్ దాదాపు రూ. 4.5 కోట్ల గ్రాస్ వరకు చేరి అందరిని ఆశ్చర్యపరిచింది. రోషన్ గత చిత్రాలతో పోలిస్తే ఇదే అతడి కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్ రికార్డ్‌గా నిలిచింది. ఈ సినిమాకు స్వప్న సినిమాస్ వంటి పెద్ద బ్యానర్ సపోర్ట్, దర్శకుడు ప్రదీప్ అద్వైతం అందించిన పవర్‌ఫుల్ టేకింగ్ ప్రధాన బలాలుగా నిలిచాయి. అలాగే మలయాళ బ్యూటీ అనస్వరా రాజన్ నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. కథ, యాక్షన్ సీక్వెన్సులు, ఎమోషనల్ ఎలిమెంట్స్ సమతుల్యంగా ఉండటంతో సినిమా చూసినవాళ్లు బాగుందని చెప్పడం వల్ల వర్డ్ ఆఫ్ మౌత్ బలంగా స్ప్రెడ్ అవుతోంది. సోషల్ మీడియాలో కూడా 'ఛాంపియన్'కు పాజిటివ్ బజ్ కొనసాగుతోంది. రివ్యూలు అనుకూలంగా రావడంతో టికెట్ బుకింగ్స్ వేగంగా పెరుగుతున్నాయి. ఈ ప్రభావంతో వీకెండ్ కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సంగీత దర్శకుడు మిక్కీ జె మేయర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి మరింత ఎనర్జీని అందించగా, మురళీ శర్మ, సంతోష్ ప్రతాప్ వంటి నటుల పర్ఫార్మెన్స్‌లు కథకు అదనపు బలం చేకూర్చాయి. మొత్తం మీద 'ఛాంపియన్' సినిమా రోషన్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తూ, బాక్సాఫీస్ వద్ద జెట్ స్పీడ్‌లా దూసుకెళుతుంది.



# సమయం వచ్చినప్పుడు మన విలువ తెలుస్తుంది

## : తేజ సజ్జా

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ హిట్ సినిమాలను తన ఖాతాలో వేసుకుంటున్నారు యువ నటుడు తేజ సజ్జా. తాజాగా ఆయన ఓ చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. కెరీర్ విషయాలు, తనపై వచ్చిన ట్రోల్స్‌పై స్పందించారు. దేనికైనా సమయం రావాలని అన్నారు. "పెద్ద పెద్ద హీరోలను కూడా ట్రోల్స్ చేస్తుంటారు. నేషనల్ అవార్డులు వచ్చిన చిత్రాలపై కూడా విమర్శలు చేస్తారు. వాళ్లు అలా అంటున్నారని మనం ఆలోచిస్తూ కూర్చుంటే ముందుకు సాగలేం. మన ప్రతిభను నమ్ముకుంటూ కెరీర్‌లో ముందుకెళ్లాలి. ఇప్పుడు కాకపోతే 10 ఏళ్ల తర్వాత అయినా వాస్తవాలు బయటికొస్తాయి. సమయం వచ్చినప్పుడు మన విలువ తెలుస్తుంది. విమర్శించే వారిని దృష్టిలో పెట్టుకుంటే పని చేయలేం. ఆడియన్స్‌ను కొత్త కథలతో ఎలా అలరించాలి అనే ఆలోచించాలి. మనకంటూ గుర్తింపు వచ్చిన తర్వాత ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇక్కడ దాకా వచ్చాను అని చెప్పడం కంటే ఆడియన్స్ వల్లే ఈ స్థాయిలో ఉన్నా అని చెప్పాలి. ఎందుకంటే బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వాళ్లకు ఒత్తిడి, ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి" అని తేజ సజ్జా చెప్పారు. "ఒకేసారి పెద్ద హీరో అయిపోవాలి అని ఇండస్ట్రీకి రాకూడదు. మనతో సినిమా తీస్తే కచ్చితంగా మినిమం గ్యారెంటీ ఉంటుంది అనేలా మనల్ని మనం నిరూపించుకోవాలి. అవకాశాలు వచ్చే వరకూ ఇండస్ట్రీలో వర్క్ చేస్తూ ఉండాలి. రవితేజ 10 సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. అంత కష్టపడ్డారు కాబట్టి ఈరోజు స్టార్‌గా ఎదిగారు. నేను చేసిన సినిమాల్లో ఏది ఇష్టం అంటే చెప్పలేను. 'హనుమాన్' వచ్చినప్పుడు చాలా బాగా చేశానని అనుకున్నా.. మిరాయ్ విడుదలైన తర్వాత 'హనుమాన్'లో కంటే అందులో బాగా నటించానని అనిపించింది. ప్రతి సినిమాకు మనల్ని మనం మెరుగుపర్చుకోవాలి" అని తేజ అన్నారు.

# నిరాశపర్చిన మోహన్‌లాల్ వృషభ




భాషల హద్దులు దాటి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న అరుదైన నటుల్లో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ఒకరు. సహజమైన నటన, సింపుల్ బాడీ లాంగ్వేజ్, పాత్రలో పూర్తిగా లీనమయ్యే తీరు ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ భాషల్లోనూ మోహన్‌లాల్‌కు విశేషమైన అభిమాన వర్గం ఉంది. ఆయన సినిమా అంటే తప్పకుండా కంటెంట్ ఉంటుందనే నమ్మకం ప్రేక్షకుల్లో బలంగా ఉండటంతో, ఆయన నుంచి వచ్చే ప్రతి చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ నేపథ్యంలో క్రిస్మస్ కానుకగా విడుదలైన మోహన్‌లాల్ తాజా చిత్రం 'వృషభ' పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా విడుదలకు ముందు విడుదలైన టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన లభించడంతో పాటు, మోహన్‌లాల్‌ను పవర్‌ఫుల్ పాత్రలో చూపిస్తున్నారన్న ప్రచారం సినిమాపై హైప్‌ను పెంచింది. నందకిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రాగిణి ద్వివేది కీలక పాత్రలో నటించగా, సమర్జిత్ లంకేష్, నయన్ సారిక మరో జంటగా కనిపించారు. అజయ్, వినయ్ వర్మ, భద్రం తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. డిసెంబర్ 25న మలయాళం, తెలుగులో ఒకేసారి ఈ సినిమాను విడుదల చేశారు. అయితే థియేటర్లలో అడుగుపెట్టిన తర్వాత 'వృషభ' పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయి స్పందన రాకపోవడంతో పాటు, తొలి రోజు వసూళ్లు ట్రేడ్ వర్గాలను షాక్‌కు గురి చేశాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'వృషభ' మొదటి రోజు నెట్ కలెక్షన్లు కేవలం రూ.70 లక్షలకే పరిమిత మయ్యాయి. ఇది మోహన్‌లాల్ కెరీర్‌లోనే అత్యల్ప ఓపెనింగ్స్‌లో ఒకటిగా నిలవడం గమనార్హం. మొదటి రోజు నుంచే సినిమాపై నెగటివ్ టాక్ రావడం వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపింది. కథ, కథనంలో బలహీనతలు ఉన్నాయన్న అభిప్రాయం ప్రేక్షకుల నుంచి వ్యక్తమవుతుండటంతో, వీకెండ్‌లో సినిమా పుంజుకుంటుందా అనే సందేహాలు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. స్టార్ పవర్ మాత్రమే సరిపోదని, కంటెంట్ బలంగా లేకపోతే ప్రేక్షకులు ఆదరించరన్న వాస్తవాన్ని 'వృషభ' మరోసారి రుజువు చేసిందని చెప్పవచ్చు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com